


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

3

సోమవారం 2 జూన్ 2025

నేటి నుంచి 100 రోజుల ప్రణాళిక
● సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు ● సంక్షేమ పథకాల వర్తింపు లక్ష్యం

4

ఆకాంక్షలు నెరవేరాలి!

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రజల వేడుకోలు

నల్లగొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజల ఆకాంక్షల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఉమ్మడి జిల్లా వాసులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసే పెండింగ్ ప్రాజెక్టులు, కాల్వలు, ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను పూర్తిచేయాలని కోరుతున్నారు. జిల్లాలో సాగయ్యే ఉద్యాన పంటల ప్రాసెసింగ్ పరిశ్రమలు, మార్కెటింగ్ సదుపాయలు కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేయాలంటున్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో విద్య, వైద్యరంగాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. యువతకు ఉపాధి కల్పించేలా పరిశ్రమల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల ఆకాంక్షలను మననం చేసుకొని వాటి సాధనకు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశిస్తున్నవి ఇవే..

- ఎస్ఎల్బీసీ సొరంగమార్గం పూర్తి చేసి ప్రతిపాదిత 3.50లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలి.
- ఎస్ఎల్బీసీ(ఏఎమ్మార్పీ) హైలెవెల్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో లైనింగ్ పూర్తి చేయించాలి. ఆయకట్టు చివరి భూములకు నీరందేలా చర్యలు తీసుకోవాలి.
- డిండి ఎత్తిపోతల పూర్తి చేసి ప్రతిపాదిత దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని 3.50లక్షల ఎకరాలకు నీరివ్వాలి.

- మిగతా 5వ పేజీలో...



నేటి నుంచి సంక్షేమ పథకాల జోష్

- అవతరణ దినోత్సవం నేపథ్యంలో కొత్త పథకాలు
- రాజీవ్ యువ వికాసానికి ప్రొసీడింగ్స్
- రైతులకు ఫౌండేషన్ సీడ్ పంపిణీ
- గ్రామపాలన అధికారులకు నియామక ఉత్తర్వులు
- రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

నల్లగొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం కొత్త సంక్షేమ పథకాలను అమలు చేయనుంది. ప్రధానంగా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. యువత సాధికారత, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడమే లక్ష్యంతో రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రూపొందించింది. పథకంలో భాగంగా రూ.లక్షలోపు సబ్సిడీని తొలివిడత అందజేయనున్నారు.ప్రతి నెలా విడతల వారీగా ఈ పథకాన్ని అమలు చేస్తారు. అక్టోబరు 2 నాటికి లబ్ధిదారులందరికీ అందజేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూన్ మొదటి వారంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇళ్లను ప్రారంభిస్తారు. పనులు జరుగుతున్న తీరును బట్టి లబ్ధిదారులకు విడతల వారీగా నిధులు మంజూరు చేస్తారు. జూన్ మొదటి వారంలో కొందరూ గృహప్రవేశం చేసేందుకు ఏర్పాట్లు కూడా జరిగాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొత్త పథకాలను వేగవంతం చేయాలని నిర్ణయించి ఆయా పథకాలను...

- మిగతా 5వ పేజీలో...

నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు

పరేడ్ గ్రౌండ్ ముస్తాబు



నల్లగొండ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పేరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. తొలుత పోలీసులు గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న పలు సంక్షేమ పథకాలను మంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారు. అదేవిధంగా వివిధ శాఖలు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన స్టాళ్లను మంత్రి సందర్శించనున్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ



కనగల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద ఉన్న శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి చీరసారె, ఒడిబియ్యం నైవేద్యాలను సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి



ప్రచారజాతాను ప్రారంభిస్తున్న చావా రవి

నల్లగొండ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య పొందాలని, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపు కోసం యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జాతాను ఆదివారం జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. విశాలమైన తరగతి గదులు, ఆటస్థలాలు ఉన్నాయని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన ఉచిత విద్యను పొందాలన్నారు. సంపాదనలో సగానికి పైగా పిల్లల చదువుల కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే సమాజానికి నష్టమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో కత్తుల రవీందర్, సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్కా శ్రీనివాస్‌చారి, పెరుమాళ్ల వెంకటేశం, నాయకులు ఎడ్ల సైదులు, జి.అరుణ, సరళ, వి.జగదీష్‌బాబు, భద్రీనాథ్, మంగ్లా నాయక్, గేరా నరసింహ, నల్లపరాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమర సైదులు, ఎం.మురళయ్య, కె.మధుసూదన్, ఎర్రనాగుల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

మూగ వేదన

- నిధుల్లేవు.. మందులు రావు..
- మూగజీవాలను పట్టించుకోని ప్రభుత్వం
- పశువైద్యానికి మందులు కరువు
- సంవత్సరానికి రావాల్సింది రూ.1.20 కోట్లకు పైగా నిధులు
- గత సంవత్సరంలో రూ.30లక్షల నిధులే విడుదల
- ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా ఇవ్వలే
- పశువైద్యం అందక రైతులు, జీవాల పెంపకదారుల ఇబ్బందులు

దేశానికి రైతే వెన్నుముక. ఆ రైతుకు వెన్నుముక పశుసంపద. నేడు ఆ వెన్ను విరిగి, రైతుల పరిస్థితి దీనంగా మారుతోంది. కంటికి రెప్పలా, ఇంట్లో సభ్యుల మాదిరి కాపాడుకుంటున్న పశుసంపదకు ఆపదొస్తే ఆదుకునే వారు లేక కర్షకులు అతలాకుతలమవుతున్నారు. పశువులకు కనీసం తినేందుకు మేత కరువై, రోగమొస్తే మందులు లేక, అత్యవసరమైతే ఆస్పత్రిలో వైద్యుడు లేక ఆ మూగ జీవాలు రోదిస్తున్న తీరు చూసి రైతు కంటతడి ఆరడంలేదు. జిల్లావ్యాప్తంగా పశువైద్యశాలలు అలంకార ప్రాయంగా మారాయన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడం, వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండడం, అటెండర్లే వైద్యులుగా మారుతుండడం అగమ్యగోచరంగా మారింది.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)





జిల్లాకేంద్రంలోని పశుగణాభివృద్ధి కార్యాలయం, మేకలకు ఇంజక్షన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

జిల్లాలో పశువైద్యానికి మందులు కరువయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధకశాఖకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. పశుసంవర్ధక శాఖలో ప్రయోగశాలలు నామమాత్రంగా మారాయి. దీంతో పాడి రైతులు, జీవాల పెంపకదారులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు రక్త, మూత్ర, తదితర పరీక్షలతో పాటు ఎక్స్‌రేలు తీయాలన్నా ఆ వసతులు లేక రైతులు నానా తంటాలు పడుతున్నారు. పెంపుడు జంతువుల విషయానికొస్తే పట్టణ, మండలాల్లో వివిధ రకాల కుక్క పిల్లలను పెంచుతున్నారు. ఇందులో ప్రధానంగా ల్యాబ్, సిజ్, పేమేరియన్, జర్మన్ షపర్డ్, రాట్‌వీలర్, స్పిట్స్ వంటి జాతులను యజమానులు ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్నారు. ఎలాంటి జబ్బులొస్తున్నా వాటికి వైద్యం అందడంలేదన్న ఆరోపణలున్నాయి. నల్లగొండ జిల్లాలో ఐదు ఏరియా ఆస్పత్రులు, 46 పశువైద్య ఆస్పత్రులు, 59 సబ్ సెంటర్లున్నాయి. అయితే ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పెంపుడు జంతువులకు అనుగుణంగా వైద్యం అందడంలేదు. నల్లగొండ జిల్లాలో గత పశుగణన లెక్కల ప్రకారం 2లక్షలకు పైగా ఆవులు, 3.37లక్షల గేదెలు, 11.16లక్షల గొర్రెలు, 3.41లక్షల మేకలు, 60 నుంచి 70లక్షలకు పైగా కోళ్లు, 16,500కుపైగా పెంపుడు జంతువులున్నాయి. వీటిన్నంటికీ వైద్యం అందించాలంటే ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సి ఉంది. ఇకపోతే ఇప్పటివరకు ఇటీవల చేపట్టిన పశుగణన లెక్కకూడా సంబంధిత అధికారుల వద్ద లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.



నల్లగొండ జిల్లాలో పశుగణన

ఆవులు	2లక్షలుపైగా
గేదెలు	3.37లక్షలు
గొర్రెలు	11.16లక్షలు
మేకలు	3.41లక్షలు
కోళ్లు	70లక్షలు
పెంపుడు జంతువులు	16,500

విడుదలైందని రూ.30లక్షలే

రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం జిల్లాకు రూ.1.20కోట్లకుపైగా మందుల కొనుగోలుకు నిధులు కేటాయించాల్సి ఉంటుంది. దాదాపు 30 నుంచి 40రకాలకు పైగా మందులను కొనుగోలు చేసి వైద్య సేవలందించాలి. కానీ గత సంవత్సరం కేవలం రూ.30లక్షలే నిధులు విడుదలయ్యాయి. మిగతా తొమ్మిది నెలల కాలానికి ఒక్క రూపాయి కూడా రాలేదు. అయితే ప్రతీ మూడు నెలలకోసారి (క్వార్టర్లీ) రూ.30లక్షలు వైద్య ఆరోగ్యశాఖకు ఇస్తే మందులను కొనుగోలు చేసి వైద్యం అందిస్తారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్కరూపాయి కూడా సమకూర్చలేదు. క్వార్టర్లీ

మిగతా 6వ పేజీలో..

నిధులు రాగానే కొనుగోలు చేస్తాం



గత సంవత్సరానికి సంబంధించి మూడు నెలలకు రూ.30లక్షల వరకు వచ్చాయి. ప్రభుత్వం మందుల కొనుగోలుకు నిధులు విడుదల చేసిన వెంటనే మందులను సేకరించి వైద్య సేవలకు కేటాయిస్తాం. దాదాపు 30 నుంచి 40 రకాల మందులను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం నిధులు కూడా రాగానే వైద్య సేవలకు వెచ్చిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పశువైద్యానికి కృషి చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు సత్వర సేవలు అందుతున్నాయి.

జీవీ రమేష్, నల్లగొండ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

సిద్ధమైన నిడమనూరు మున్సిఫ్‌కోర్టు



నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న హైకోర్టు సీజే

నిడమనూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలో రూ.5.50కోట్ల నిధుల వ్యయంతో నిర్మించిన మున్సిఫ్ కోర్టు(జూనియర్ సివిల్ జడ్జి కోర్టు) భవన సముదాయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మూడేళ్లుగా సాగిన కోర్టు నిర్మాణ పనులు పూర్తికాగా, కోర్టు భవనాన్ని హైకోర్టు సీజే సోమవారం ఉదయం 10.30 గంటలకు సుజోయ్ పాల్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నిడమనూరు, హాలియా, పెద్దవూర, తిరుమలగిరిసాగర్, త్రిపురారం మండలాలకు చెందిన కేసులను గతంలో మిర్యాలగూడ కోర్టులో విచారించేవారు. కక్షిదారులు, న్యాయవాదులకు ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా, నిడమనూరులో మున్సిఫ్ కోర్టును ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. చివరికి 2015 ఆగస్టు 16న అప్పటి హైకోర్టు న్యాయమూర్తులు యడవెల్లి రాజశేఖర్‌రెడ్డి, చల్లా కోదండరామ్ నిడమనూరులో మున్సిఫ్‌కోర్టును ప్రారంభించారు. అయితే నాటి నుంచి సొంత భవనం లేక మండల పరిషత్ కాంప్లెక్స్ కార్యాలయంలో అద్దె ప్రాతిపదికన పదేళ్లుగా కోర్టును నిర్వహిస్తూ వచ్చారు. పక్కా భవనం కోసం ఎన్నెస్పీ క్యాంపు ఆవరణలో 230 సర్వే నెంబరులో 32గుంటల భూమిని 2016లో అధికారులు కేటాయించగా, మూడేళ్ల క్రితం గత ప్రభుత్వం రూ.5.50కోట్లు మంజూరు చేయడంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కోర్టు హాలు, న్యాయవాదుల ఛాంబర్, గదులు, జడ్జి నివాసానికి క్వార్టర్‌ను నిర్మించారు. కాగా, కోర్టు భవన ప్రారంభోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉన్నం చినవీరయ్య కోరారు.

వర్గీకరణతో మాదిగలకు, ఉపకులాలకు న్యాయం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



మంత్రి దామోదర్ రాజనర్సింహ, మాజీ మంత్రి జానారెడ్డిని సన్మానిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య

నల్లగొండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుతో రాష్ట్రంలో మాదిగలు, మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలైన తర్వాత ఆదివారం తొలిసారిగా జిల్లాకేంద్రానికి వచ్చిన సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య ఆధ్వర్యంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో మాదిగలు, మాదిగ ఉపకులాలకు ఎంతగానో న్యాయం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి పథకాలు అమలవుతున్నాయన్నారు. అనంతరం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, మాదిగ జేఏసీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, ఎమ్మార్పీఎస్, ఎమ్మార్పీఎస్ ఉపకులాలు, మాదిగ జేఏసీ నాయకులు పెరిక ఉమామహేశ్వర్, కత్తుల జగన్, కత్తుల తులసీదాస్, దుబ్బ రూప అశోక్ సుందర్, తలకొప్పుల గిరి, షణ్ముక, భాషపాక హరికృష్ణ, నవీన్, హరిప్రసాద్, కొప్పు అశోక్, నరేందర్, ప్రసాద్, అశ్విని, అంజమ్మ, రుద్ర పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం



విలేకరులతో మాట్లాడుతున్న గోలి మధుసూదన్‌రెడ్డి

రామగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని గట్టెక్కించేందుకు ప్రధాన మంత్రి కిసాన్ సమాన్ నిధి కింద ప్రతీ రైతుకు రూ.6వేల ఇస్తుందన్నారు. అదేవిధంగా ఎరువులు అందుబాటులోకి తేవడంతో పాటు ఫసల్ బీమా పథకం అమలు చేస్తుందన్నారు. పంటలకు మద్దతు ధరలు రెట్టింపు చేయడంతో పాటు భూసార పరీక్షలు, పొలాల వద్దకు అంతర్గత రోడ్ల నిర్మాణం, గోదాములు, కల్లాల నిర్మాణం, విద్యుత్ ఉత్పత్తి పెంపుదల, రైతులకు అధిక దిగుబడులు ఇచ్చే నూతన పంట విత్తనాల అభివృద్ధి, నూతన డెయిరీలకు 50 శాతం సబ్సిడీ పథకాలను అమలు చేస్తుందని వివరించారు. ప్రకృతి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బీపంగి జగ్జీవన్‌రాం, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి తిరుమల మహేష్, ప్రధాన కార్యదర్శి కటికం శ్రీధర్, తరాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులు మారినా ఎజెండా మారలేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి

మిర్యాలగూడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్రంలో 11 ఏళ్ల పాలకులు మారినా వారి ఎజెండా మారలేదని, రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై వివక్ష చూపుతోందని అన్నారు. విపక్ష పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులు కేటాయించడంలేదని, విభజన హామీలను అమలు చేయడంలేదన్నారు. రాష్ట్రంలో పాలకులు మారినా విధానాలు మారడం లేదన్నారు. పేదలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేసి ప్రజా సంక్షేమంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. మహాలక్ష్మి పథకం, పెంచిన పెన్షన్‌లను, రైతుభరోసా, నిరుద్యోగభృతి అమలుచేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యారంగాలపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. గ్రామపంచాయితీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, రాష్ట్రంలో 1.20కోట్ల మంది అసంఘటితరంగ కార్మికులు ఉన్నారని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, బవాండ్ల పాండు, పాదూరి పవిధర్‌రెడ్డి, పారేపల్లి సత్యనారాయణరావు, లింగయ్య, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో భద్రత సవాలే

● వాడపల్లి చెక్‌పోస్ట్‌పై ప్రత్యేక నిఘా
● ఆగని అక్రమ రవాణా, చోరీలు


వాడపల్లి చెక్‌పోస్ట్

తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి చెక్‌పోస్ట్ వద్ద భద్రత పోలీసులకు సవాల్‌గా మారింది. గంటల వ్యవధిలో వేయికి పైగా వాహనాలు వస్తూ పోతూ ఉండటంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేక పోతున్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. వాడపల్లి వంతెన మార్గం నుంచి ప్యాడి, ఇసుక, అక్రమ పీడీఎస్ బియ్యం, గోవుల తరలింపు జరుగుతోందని విస్పష్టంగా తెలిసినా వాటిని పట్టుకోవడంలోనూ పూర్తిగా అరికట్టడంలోనూ అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

సరిహద్దు ప్రాంతం కావడంతో వాడపల్లి పరిసర ప్రాంతాల్లో పక్కా ప్రణాళికతో చోరీలు చేసి నేరస్థులు సులువుగా తప్పించుకుంటున్నట్లు అనుమానిస్తున్నారు. నిరంతరం నిఘా వేసినా అక్రమాలను అరికట్టడం, భద్రతా చర్యలు చేపట్టడం పోలీస్‌లకు సవాల్‌గా మారిందన్న అభిప్రాయం నెలకొంటోంది. మే 9న తెల్లవారుజామున దామరచర్ల మండల కేంద్రంలో జ్యువెలరీ షాపు షట్టరు తాళాలను పగులగొట్టి అందులోకి ప్రవేశించిన దొంగలు 27.4 తులాల బంగారు నగలను అపహరించుకుపోయారు. బండరాళ్లతో షట్టర్ తాళాలు పగులగొట్టిన దొంగలు షాపులోకి ప్రవేశించి సీసీ కెమెరా వైర్ల కనెక్షన్ కట్‌చేశారు. బంగారునగలతోపాటు సీసీ ఫుటేజీ హార్డ్‌డిస్క్‌ను కూడా ఎత్తుకెళ్లారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలను సేకరించినా ఫలితం లేకుండాపోయింది.



అక్రమ ధాన్యం రవాణా

తెలంగాణ ప్రభుత్వం ధాన్యం రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించి ఐకేపీల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్ అందించే కార్యక్రమం చేపట్టింది. బోనస్ డబ్బును కొల్లగొట్టేందుకు ఆంధ్రా రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా వాడపల్లి చెక్‌పోస్ట్ మీదుగా తెలంగాణకు తరలించి విక్రయించే ఏర్పాట్లు చేసుకున్నారు. ఆలస్యంగా గుర్తించిన పోలీసులు నిఘా పెంచి ధాన్యం లారీలను చెక్‌పోస్ట్ వద్ద నుంచి వెనక్కి తిప్పి ఆంధ్రాకు పంపుతుండటంతో ధాన్యం దళారీ వ్యాపారులు మరో మార్గం ద్వారా హుజూర్‌నగర్ వైపు నుంచి తిరిగి రాష్ట్రంలోకి ప్రవేశిస్తుండటంతో నాగార్జునసాగర్, వాడపల్లి చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సుమారు 10 ధాన్యపు లారీలను పట్టుకుని కేసులు నమోదుచేశారు. పోలీసుల కళ్లుగప్పి టన్నుల కొద్దీ రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారు. వినియోగదారుల వద్ద కిలో రూ.8కి కొనుగోలు చేసి లారీలు, ఇతర వాహనాల ద్వారా చెక్‌పోస్ట్ దాటించి కాకినాడ పోర్ట్‌కు తరలించి విదేశాలకు ఎగుమతి చేసి రూ.కోట్లు గడించినట్లు ఆరోపణలున్నాయి. మిర్యాలగూడ డీఎస్పీ ఆధ్వర్యంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పీడీయాక్ట్ నమోదు చేసి వివిధ కేసుల్లో సుమారు 80మంది వరకు అరెస్ట్ చేశారు. దీంతో బియ్యం అక్రమ దందా కొంత తగ్గినా ప్రభుత్వం రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో అక్రమ రవాణా నిలిచిపోయినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. ఐదారు నెలల క్రితం వరకు ఈ మార్గంలో గంజాయిని సైతం అక్రమంగా రాష్ట్రంలోకి తెచ్చి విక్రయిస్తున్నారని పట్టణ, గ్రామీణ యువత పెద్దఎత్తున గంజాయికి అలవాటు పడి జీవితాలను వృథా చేసుకుంటున్నారని ఆరోపణలు రావడంతో రాష్ట్రవ్యాప్త డ్రగ్స్ నిర్మూలనా చర్యల్లో భాగంగా గంజాయి సరఫరా చేసే వ్యక్తులపై నిఘావేసి 35 మందిని అరెస్ట్‌చేసి 180 కిలోల వరకు గంజాయిని పట్టుకున్నారు. గోవులను సైతం చిన్నచిన్న వాహనాల్లో కుక్కి కబేళాలకు తరలించే ప్రయత్నాలను కూడా పోలీసులు అడ్డుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో అరికట్టలేక పోతున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుక పథకం అమలవుతుండటంతో కొందరు ఇసుకను లారీల ద్వారా వాడపల్లి వంతెనపై నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి తరలించి ఇసుక డంపులు ఏర్పాటుచేసి ట్రాక్టర్ల ద్వారా ప్రజలకు అధిక ధరలకు విక్రయించి అక్రమార్జన కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏటీఎంలో రూ. 22 లక్షల చోరీ

దామరచర్ల మండలకేంద్రంలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపైనున్న ఎస్‌బీఐ ఏటీఎంను గతేడాది డిసెంబర్‌లో దొంగలు దోచుకెళ్లారు. అందులోని రూ.22లక్షలను ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌ను సైతం దొంగలు ఎత్తుకెళ్లారు. ప్రొఫెషనల్స్ చేసిన చోరీగా పోలీసులు గుర్తించి దర్యాప్తు చేపట్టినప్పటికీ దొంగల ఆచూకీ కనిపెట్టలేకపోయారు. పలుమార్లు రెక్కీ నిర్వహించి పక్కా ప్రణాళికతోనే సరిహద్దు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాడపల్లి చెక్‌పోస్టు వైపుగా ప్రయాణించి పోలీసుల కళ్లుగప్పి ఆంధ్రలోకి వెళ్లారు. నగల చోరీ, ఏటీఎం కేసులలో పోలీసులు ఎట్టకేలకు ఒకరిద్దరి నిందితులను పట్టుకుని కోర్టుకు అప్పగించినా సొమ్ము రికవరీ కాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేధిస్తున్న సిబ్బంది కొరత

చెక్‌పోస్ట్ సిబ్బంది నామమాత్రం కార్యకలాపాలకే పరిమితమవుతుండగా తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టలేక పోతున్నారనే ఆరోపణలున్నాయి. చెక్‌పోస్ట్ సిబ్బందికి మామూలు అందితే చాలు వాహనంలో రవాణా చేసే సరుకు ఏమిటో, పరిమితికి మించి అదనపులోడుతో వెళ్తున్నా పట్టించుకోరనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వాడపల్లి పోలీస్‌స్టేషన్ రహదారిపై లేకపోవడం అన్ని సమయాల్లో పోలీసులు గస్తీ కాయలేకపోవడం, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటం అక్రమార్కులకు అనుకూలంగా మారుతుందనే అభిప్రాయం వినపడుతోంది. మాడ్గులపల్లి టోల్‌గేట్‌వద్ద గత నెలక్రితం పోలీస్ ఔట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఔట్‌పోస్ట్ వద్ద ఇప్పటికీ అక్రమంగా ఆంధ్రప్రదేశ్ నుంచి గోవులను తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకోవడం విశేషం. సరిహద్దు భద్రత విషయమై పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి అక్రమాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పర్మినెంట్ ఔట్‌పోస్ట్‌కు ఏర్పాట్లు



ఇప్పటివరకు సమర్థంగా నేరాల అదుపునకు చర్యలు తీసుకున్నాం. నిఘా తీవ్రతరం చేస్తుండటంతో అక్రమార్కులు రూట్‌లు మారుస్తున్నారు. వాడపల్లి వద్ద పోలీస్‌స్టేషన్ రహదారికి దూరంగా ఉండటం కొంత ఇబ్బందిగా మారింది. ఇటీవల పోలీస్‌స్టేషన్‌కు నూతన సిబ్బందిని కేటాయించాం. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు చెక్‌పోస్ట్ వద్ద పర్మినెంట్ ఔట్‌పోస్ట్ ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతాం.

రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ

సూర్యాపేటలో చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సూర్యాపేటటౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆదివారం సూర్యాపేట పట్టణ ఇన్‌చార్జీ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని చంద్రన్న కుంట ముత్యాలమ్మ గుడి వెనుక ప్రాంతంలో సారగండ్ల రంగయ్య నివాసముంటున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో ఉంటున్న తన పెద్ద కుమార్తె ప్రసూతీ కోసం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. శనివారం ఇంట్లో ఎవరూ లేక పోవడంతో తలుపులకు ఉన్న తాళాలను ధ్వంసంచేసి బీరువాలోని రెండు తులాల బంగారం, వెండి నగలు, రెండు సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్ దొంగలు అపహరించుకుపోయారు. ఆదివారం ఇంటి పక్కల వారు ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి, రంగయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో రంగయ్య కుటుంబ సభ్యులు హైదరాబాద్‌నుంచి వచ్చి ఇంట్లో చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా, క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. ఫింగర్ ప్రింట్ తీసుకొని, సీసీ ఫుటేజీలను పరిశీలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రహరీని ఢీకొట్టిన కారు




గట్టుప్పల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలకేంద్రంలో ఆదివారం సాయంత్రం అతివేగంతో వచ్చిన కారు స్థానిక పోలీస్ స్టేషన్ ప్రహరీని ఢీకొట్టింది. ఈ ఘటనలో పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. కారు డ్రైవర్ తేరట్‌పల్లి గ్రామం నుంచి గట్టుప్పల్ మండల కేంద్రానికి వస్తుండగా, కారు అదుపు తప్పి స్టేషన్ ప్రహరీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

నేటి నుంచి మునిసిపాలిటీల్లో

వందరోజుల ప్రణాళిక

● సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు ● సంక్షేమ పథకాల వర్తింపు లక్ష్యం


భువనగిరి పట్టణ ముఖచిత్రం

భువనగిరి టౌన్, సూర్యాపేట టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలలోని సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, ప్రజలకు సంక్షేమ పథకాల వర్తింపు తదితర లక్ష్యాల సాధనకు మునిసిపల్ పరిపాలనా విభాగం తలపెట్టిన వంద రోజుల ప్రణాళిక నేటినుంచి జిల్లాలోని అన్ని పట్టణాల్లో ప్రారంభం కానుంది. జూన్ 2 నుంచి సెప్టెంబరు 10 వరకు కొనసాగనున్న ప్రత్యేక ప్రణాళికలో పట్టణాల్లోని అన్ని బస్తీల్లో అధికారులు పర్యటించి స్థానికులతో మమేకమవుతారు. ఈమేరకు జిల్లాలోని భువనగిరి, ఆలేరు, చౌటుప్పల్, మోత్కూరు, పోచంపల్లి, యాదగిరిగుట్ట మునిసిపాలిటీలలోని 104 వార్డులలో అధికారులు పర్యటిస్తారు. సూర్యాపేట మునిసిపాలిటీలో మొత్తం 48 వార్డులుండగా లక్ష 60 వేల మంది జనాభా ఉన్నారు. 48 వార్డుల్లో 100 రోజుల కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అదేవిధంగా కోదాడలో 35వార్డులుండగా 75వేల జనాభా ఉంది. అదేవిధంగా హుజూర్‌నగర్‌లో 28వార్డులు 35వేల జనాభా తిరుమలగిరిలో 15వార్డులు 18వేల జనాభా ఉంది. నేరేడుచర్లలో 15వార్డులు ఉండగా 16వేల జనాభా ఉంది. ఇందుకోసం మునిసిపాలిటీలవారీగా ఏర్పాట్లు పూర్తిచేశారు.

ప్రణాళిక ఇలా..

వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణాల్లో 51 కార్యక్రమాలు చేపట్టనున్నారు. పారిశుధ్య పనులు, పెద్ద మురుగుకాల్వలు, నాళాలలో పూడిక తీత, ప్రమాదాల నివారణకు జాలి ఏర్పాటు, తడి, పొడి చెత్తపై ఇంటింట అవగాహన, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ, దోమల నివారణ, పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరాలు, అవగాహన ర్యాలీలు నిర్వహిస్తారు. సోషల్ మీడియా క్యాంపెయిన్, వాల్ పెయింటింగ్స్, స్వచ్ఛత అవార్డుల, క్విజ్, చిత్రలేఖనం, రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. భువన్ సర్వే ద్వారా ఇంటి నెంబర్ల క్రమబద్ధీకరణ, ట్రేడ్ లైసెన్స్ జారీ, ఇంటి నల్లకనెక్షన్లను ఆన్‌లైన్ చేయుట, నూతన మహిళా సంఘాలు, వీధి విక్రయదారుల సంఘాల ఏర్పాటు, బ్యాంకు లింకేజీ రుణాలు, స్ట్రీట్ వెండింగ్ జోన్లపై సమీక్ష, స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్స్, ఓవర్‌హెడ్ ట్యాంక్స్ శుభ్రం చేయడం, లోతట్టు ప్రాంతాల్లో వరద నీటి ప్రమాదాలకు చర్యలు, గుంతలు గుర్తించి పూడ్చుట, శిథిల భవనాల కూల్చివేత, ఇంకుడు గుంతల నిర్మాణం, చౌరస్తాలు, పార్కుల అభివృద్ధి, హరితహారం, వీధుల్లో పిచ్చి మొక్కల తొలగింపు, రహదారులు, బహిరంగ స్థలాల్లో పేరుకుపోయిన వ్యర్థాల తరలింపు పరిసరాల పరిశుభ్రత, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తారు.

ఏర్పాట్లు ఇలా..

వందరోజుల ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలోని ఆరు మునిసిపాలిటీలలోని 104 వార్డులకు ప్రత్యేక అధికారులను నియమించారు. ప్రత్యేక అధికారులు వంద రోజులపాటు తమకు కేటాయించిన వార్డులలో నిర్దేశిత 51 కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రతీవారం ప్రణాళికపై అధికారులు సమీక్షిస్తారు. అధికారుల ఆకస్మిక తనిఖీలు చేస్తారు. ప్రత్యేక దినాల్లో సమావేశాలు నిర్వహించి రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు తదితర పథకాల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు. ఈ మేరకు ఆదివారం భువనగిరి మునిసిపాలిటీలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కమిషనర్ జి.రామలింగం, వంద రోజుల ప్రణాళిక అమలుపై సమీక్షించారు. విధుల నిర్వహణలో సిబ్బంది, అధికారులు చిత్తశుద్ధి చూపాలని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం
సూర్యాపేట జిల్లా అధికారుల నెంబర్లు

విభాగం	పేరు	ఫోన్ నెంబర్
నీటి సరఫరా	ఎం.తిరుమలయ్య(ఏఈ)	9849906795
వీధిలైట్లు	వై.రాజురెడ్డి	7702000960
మౌళిక వసతులు	బీవీ.సత్యరావు(డీఈ)	9849906794,
	ఎం.కిరణ్	9849908022
పారిశుధ్య నిర్వహణ	శ్రీనివాస్	9849908022
	యాదగిరి	9032682512
టౌన్‌ప్లాన్	సోమయ్య	8686821450
రెవెన్యూ విభాగం	కళ్యాణి	9849908250
మెప్మా విభాగం	శ్వేత	6300958256
మునిసిపల్‌కమిషనర్	శ్రీనివాస్	9849905912

100 రోజుల యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా అమలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట మునిసిపాలిటీలో 100 రోజుల యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేస్తాం. పట్టణ ప్రజలు సహకరించాలి. సమస్యలను పరిష్కరించేలా ప్రణాళిక రూపొందిస్తాం.

బి. శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, సూర్యాపేట

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ఆవులు మృతి

నల్లగొండ జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి చెందాయి. నాంపల్లి మండలంలో ఒకటి, కొండమల్లేపల్లిలో మరొకటి మేత కోసం వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి.


దేవరోనితండాలో విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు

నాంపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాంపల్లి మండల పరిధిలోని నేరళ్లపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల పెద్ద సైదయ్యకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ భూమి వద్ద మేత వేయడానికి వెళ్లిన ఆవు పక్కనే ఉన్న మోటార్ స్టార్టర్ వైరు తగిలి మృత్యువాత పడింది. ప్రభుత్వం ఆదుకోవాలని సైదయ్య కోరారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని దేవరోనితండా గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన ఇస్లావత్ రాకేష్‌నాయక్ ఆవు మేత మేస్తుండగా, పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మను తగలడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది.

కిరాణ కొట్టు.. పూలచెట్టు



యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన చిలువేరు లలిత కిరాణ కొట్టుపై శోభాయమానంగా విరబూసిన పూల చెట్టు చూపరులను ఆకట్టుకుంటోంది. మండే వేసవికి ఉపశమనం కలిగిస్తోంది. ఈ గ్రామంలోని ప్రధాన రహదారిపై చౌటుప్పల్‌కు వెళ్లే దారిలో రోడ్డుపక్కనే ఉన్న కిరాణకొట్టుపై అలంకరించినట్లు ఎరుపురంగులోని కాగితంపూలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ.. అటువైపు వెళ్తున్న పాదచారులను ఆకట్టుకుంటోంది. (ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

పోలీస్ సేవా పతకానికి ఎంపిక


నాగమల్లు

నూతనకల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ శాఖ ప్రకటించిన పోలీస్ సేవా పతకాల్లో సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన అంజపల్లి నాగమల్లు ఎంపికయ్యారు. ఆయన హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన బాధితులను ఆసుపత్రులకు చేర్చడం, హైదరాబాద్‌లో వరదలు వచ్చినపుడు, కరోనా సమయంలో ప్రజలకు అందించిన సేవలు, రక్తదానం, తాను స్వయంగా పాటలు రాసి పాడుతూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ, అనేక కార్యక్రమాలు చేపట్టడడంతో అతనికి ఈ పతకం వరించినట్లు నాగమల్లు తెలిపారు. పతకానికి ఎంపికైన నాగమల్లును గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

జాతీయస్థాయి కార్యక్రమంలో 'తేజ' విద్యార్థులు


హైదరాబాద్‌లో తేజ విద్యార్థులు

కోదాడ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ తేజ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా పాఠశాలస్థాయి విద్యార్థుల్లో సాంస్కృతిక అంశాల్లో ప్రతిభను ప్రోత్సహించడానికి నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమ విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. దేశవ్యాప్తంగా 5వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, భారతీయ సంప్రదాయ సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, క్రాఫ్ట్ అంశాల మీద ప్రముఖులతో కార్యశాల నిర్వహించార న్నారు. తమ పాఠశాల నుంచి 14 మంది విద్యార్థులు కార్యక్రమానికి ఎంపికై వెళ్లారని వివరించారు.

అథ్లెటిక్‌లో 'ఆకాంక్ష' విద్యార్థి ప్రథమస్థానం



హాలియా,జూన్ 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో హాలియాలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్.పవన్‌కుమార్ ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ మోదాల రవీందర్ తెలిపారు. ఆదివారం జరిగిన 11వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ 300 మీటర్ల పోటీలలో 33 జిల్లాలు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచి పవన్‌కుమార్ ప్రథమ స్థానం సాధించాడని వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, పీఈటీ ఆవుల చంద్రశేఖర్ పవన్‌ను అభినందించారు.

అద్దెకారు యజమానుల

బతుకులు బేజార్

● ప్రభుత్వ శాఖల్లో కార్ల అద్దె యజమానుల బతుకు చిద్రం
● 2017 నాటి అద్దెనే కొనసాగిస్తున్న ప్రభుత్వం
● డీజిల్ ధరలు, పెరిగిన ఖర్చులతో సతమతం
● అప్పుల ఊబిలో కూరుకపోతున్న వాహనదారులు

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ప్రభుత్వ కార్యాలయాల్లో అద్దెకు కార్లను నడిపిస్తున్న యజమానుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. సాధారణంగా అద్దెకు కారు పెడితే సకాలంలో అద్దె రావడంతోపాటు కారుకు అవుతున్న ఖర్చుకు అనుగుణంగా అద్దె వచ్చినప్పుడే ఆ కారు యజమాని అంతో ఇంతో లబ్ధి పొందుతాడు. కానీ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో కార్లను అద్దెకు పెట్టిన యజమానులు పెట్టుబడులు రాక ఆర్థికంగా చితికిపోతున్నారు. ఒప్పందాలను ఉల్లంఘించడంతోపాటు అద్దెకు తీసుకున్న అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యంగా కారుకు నష్టం వాటిల్లితే ఆ కారు యజమానులే మరమ్మతులు చేయించుకోవడానికి అప్పులు చేసి డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం నుంచి సకాలంలో అద్దె చెల్లించకపోవడంతో కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. అదేవిధంగా కొందరు అధికారులు అద్దె ఒప్పందానికి అనుగుణంగా కార్లను ఉపయోగించకుండా ఇతర ప్రాంతాల్లో కార్లను వాడుకుంటూ యజమానులను నష్టాలకు గురి చేస్తున్నారు. ఒకవేళ ఎవరైనా యజమాని ఇదేమిటని ప్రశ్నిస్తే నీ కారు బాగా లేదు. కండీషన్‌లో లేదు తొలగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్న ఘటనలున్నాయి. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున అద్దెకార్లు నడుస్తున్నాయి.

2017 నుంచి నెలకు రూ.33వేల అద్దెనే...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారులు జిల్లాలో పర్యటించడానికి అద్దెకార్లను పెట్టుకోవడానికి అనుమతిచ్చింది. 2006లో రూ.14వేలను నెలకు చెల్లించి కార్లను అద్దెకు పెట్టుకునే వారు. ఆ తర్వాత 2008లో రూ.17వేలు కాగా 2012 సంవత్సరం నుంచి నెలకు రూ.24వేలను కార్ల అద్దెలుగా చెల్లిస్తూ వస్తున్నారు. అయితే 2017 నుంచి మాత్రం రూ.33వేలు నెలకు చెల్లించేలా ఉత్తర్వులు చేశారు. 2017 వరకు డీజిల్ ధర రూ.56 నుంచి రూ.57వరకు ఉండేది. అయితే ప్రస్తుతం డీజిల్ ధర లీటర్‌కు రూ.97గా ఉంది. డీజిల్ ధరలు పెరిగినప్పటికీ 2017 నాటి అద్దెను మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుండటంతో కార్ల యజమానులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. వారి జీవనోపాధి కూడా కష్టతరంగా మారుతుంది. కొంతమంది డ్రైవర్లను పెట్టుకోగా మరికొంత మంది గిట్టుబాటు కాకపోవడంతో ఓనర్ కం డ్రైవర్‌గా కొనసాగుతున్నారు.




ప్రభుత్వం నెలకు చెల్లించే రూ.33వేలు ఏ మాత్రం సరిపోవడం లేదని వాపోతున్నారు. ఒక్కో కారు ప్రతీనెల 2500 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. ఇందులో డీజిల్‌కు రూ.10వేల నుంచి రూ.12వేలు ఖర్చురాగా డ్రైవర్ జీతం, సంవత్సరానికి రూ.20వేల ఇన్సూరెన్స్, సర్వీసింగ్, ఈఎంఐల చెల్లింపులతో ఏ మాత్రం మిగలవని పేర్కొంటున్నారు. డ్రైవర్ పెట్టుకునే యజమానులకు అయితే నెలకు కనీస ఖర్చులకు కూడా రాని పరిస్థితులు ఉండగా, ఓనర్ కం డ్రైవర్లకు కూడా మిగిలేది కేవలం డ్రైవర్ జీతమనేది స్పష్టమవుతుంది.

మూడు నెలలకు ఒకసారి ఇచ్చే అద్దె ఒక నెలదే..

ఓ వైపు అష్టకష్టాలు పడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో కార్లను నడుపుకుంటున్న యజమానులకు ప్రతీనెలా అద్దెకూడా రావడం లేదు. చాలా నెలలు పెండింగ్ పెడుతుండటంతో కార్ల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి అయితే మూడు నెలలకు రూ.99వేలు అవుతుంది. అయితే నెలనెలా బిల్లు ఇవ్వని ప్రభుత్వం మూడు నెలలకు కలిపి అయిన రూ.99వేలు ఇచ్చి ఉంటే వాహన యజమానులకు ఆర్థికంగా కొంత వెసులుబాటు ఉంటుంది. కానీ మూడు నెలలకు సంబంధించి బిల్లులో ఒక నెల మాత్రం అంటే రూ.33వేలు మాత్రమే చెల్లిస్తారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు వాహన యజమానులను చుట్టుముడుతున్నాయి. అనేకసార్లు కార్ల యజమానులు డీజిల్ ధరలకు, ఇతర ఖర్చులకు అనుగుణంగా వాహనాల అద్దెను పెంచాలని, అదేవిధంగా ప్రతీనెల బిల్లును సకాలంలో ఇవ్వాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకునే దాఖలాలు లేవు. కేవలం ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నట్లు సమాచారం. కొందరూ అధికారులు డ్రైవర్లకు కనీస మర్యాద కూడా ఇవ్వకుండా వారిపై ఇష్టానుసారంగా మాట్లాడుతూ అవమానాలకు గురిచేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ప్రభుత్వం కార్ల అద్దెను పెంచి ఆదుకోవాలి



ప్రభుత్వ కార్యాలయాల్లో కార్లకు అద్దెకు పెడుతున్న వారు అప్పుల ఊబిలో కూరుకపోతున్నారు. నిరుద్యోగంతో ప్రభుత్వ కార్యాలయాల్లో వాహనాన్ని అద్దెకు పెట్టుకొని జీవనం సాగించాలని భావిస్తున్నప్పటికీ ప్రభుత్వం సరైన అద్దెను ఇవ్వక కార్లను నడిపే పరిస్థితి లేకుండా పోతుంది. అప్పులు చేసి వాహనాలు కొనుగోలు చేసిన వారు ఈఎంఐలు కట్టుకోలేక ఈ ఫీల్డ్ నుంచి తప్పుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అద్దెను పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

కంచుకంట్ల వెంకటేశ్వర్లు, అద్దె వాహన యజమాని, నల్లగొండ

త్వరలో బస్వాపూర్ పరిహారం

- సంవత్సరాల తరబడి ఎదురు చూపులు
- రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధితులు



తుర్కపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయి పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం ఎదురు చూస్తున్న గిరిజనులకు త్వరలో పరిహారం అందనుంది. నెల రోజుల్లో వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.21.60లక్షలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.7.61లక్షలు పరిహారం ఇవ్వనున్నట్లు అధికారుల హామీ ఇచ్చినట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం జిల్లాలో 11.39టీఎంసీల సామర్థ్యం గల బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మిస్తోంది. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కోసం నిర్మించే ఆనకట్ట కోసం రుస్తాపూర్, తిమ్మాపూర్, చోక్లతండా, కోక్యాతండా, పీర్యాతండా గ్రామాలకు చెందిన భూములను గతంలోనే సేకరించారు. 279ఎకరాల భూమి సేకరిస్తుండడంతో పీర్యాతండా తప్ప చోక్లతండా, కోక్యతండా గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. గతంలోనే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తండాలను సందర్శించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందించేందుకు గ్రామాల్లో ఎన్ని ఇళ్లు, ప్రభుత్వ భవనాలు ఎన్ని ఉన్నాయి, ఎన్ని కుటుంబాలు, 18సంవత్సరాలు నిండిన వారు ఎంత మంది ఉన్నారని సర్వే నిర్వహించి తండాలో ఉన్న ఇళ్లన్నింటికీ నెంబర్లు వేశారు. ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. 279ఎకరాలకు 2020ఫిబ్రవరి నెలలో భూ సేకరణ కోసం 29 ఎకరాలకే నోటిఫికేషన్ జారీ చేసి సేద్యం చేస్తున్న 20 ఎకరాల భూమికి మాత్రమే ఎకరాకు రూ.15.05లక్షలు చొప్పున చెల్లించింది. మిగితా తొమ్మిది ఎకరాల్లో డీసీసీబీ లేవుట్ ఉన్నందున పరిహారం ఇవ్వలేదు. ఈ లేవుట్‌లో కొందరు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఈ ప్లాట్లకు ప్రభుత్వం తక్కువ పరిహారం ఇస్తుందని కొందరు పరిహారం తీసుకోలేదని తెలిసింది. 2022 అక్టోబరు 2న 241ఎకరాల భూమి సేకరిస్తున్నట్లు ప్రభుత్వం రెండోసారి నోటిఫికేషన్ జారీ చేసింది. అక్టోబరు 9, 2023న అవార్డు ప్రకటిస్తున్నామని తండావాసులకు, భూ నిర్వాసితులకు నోటీసులు పంపారు.

83 కుటుంబాల్లో 234 మందికి..

చోక్ల, కోక్యాతండాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ప్రభుత్వం పరిహారం ఇచ్చేందుకు 83 కుటుంబాల్లో 234 మందిని గుర్తించింది. ఇందులో భార్య భర్తకు కలిపి ఒక ప్యాకేజీ ఇస్తారని, ఆ కుటుంబంలో తల్లి లేదా తండ్రికి, 18 సంవత్సరాలు నిండిన పిల్లల్లో ఒక్కొక్కరికి ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.7.61లక్షలు ఇవ్వనున్నారు. ఇళ్ల, ఇంటి ఖాళీ స్థలాలు, టీటీసీపీ లేవుట్ ప్లాట్లకు ప్రత్యేక ప్యాకేజీ ఉంటుందని అధికారులు చెప్పినట్లు నిర్వాసితులు తెలిపారు. వ్యవసాయ భూ ములకైతే ఎకరాకు రూ.18లక్షల నుంచి రూ.21.60లక్షలు, బోరు, బావులు, చెట్లు, ఫలవృక్షాలకు కూడా పరిహారం ఇస్తారని తెలిసింది.

పరిహారం ఇచ్చి ఆదుకోవాలి



ప్రాజెక్టు నిర్మాణంలో మా భూములు కోల్పోవడంతో కొన్ని సంవత్స రాలుగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా పిల్లలకు పెళ్లిళ్లు చేయాలంటే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గత ప్రభుత్వం పరిహారం అందించడంలో నిర్లక్ష్యం వహించింది. ప్రస్తుత ప్రభుత్వమైన మా సమస్యలను గుర్తించి పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలి.
- భూక్య రామునాయక్ గ్రామం,చోక్లతండా

బునాదిగాని కాల్వ విస్తరణకు మోక్షం

- రూ. 266.69కోట్లతో 98.64కిలో మీటర్లు విస్తరణ పనులు
- జూలై 10వరకు కాల్వపు నీటి సరఫరా నిలిపివేత



బీబీనగర్ మండలం మక్తానంతారం రెవెన్యూ పరిధిలో ప్రారంభ కాల్వ వద్ద ముమ్మరంగా కొనసాగుతున్న కాల్వ విస్తరణ పనులు

బీబీనగర్,జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బునాదిగాని కాల్వ విస్తరణ పనులు మొదలయ్యాయి. బీబీనగర్ మండలం మక్తానంతారం గ్రామ శివారులో మూసీవద్ద నుంచి పనులు మొదలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని మూసీ కాల్వల విస్తరణ పనులకు ప్రభుత్వం ఇటీవల రూ.500కోట్లు మంజూరు చేసింది.ఇందులో ఒక్క బునాదిగాని కాల్వ విస్తరణకు రూ.266.69కోట్లను కేటాయించింది. 10రోజుల క్రితం కాల్వ విస్తరణ పనులు ప్రారంభించారు. ఇటు యాదాద్రి భువనగిరి జిల్లా అటు వైపు మేడ్చల్ జిల్లా సరిహద్దులో బీబీనగర్ మండలం మక్తానంతారం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 229లో మూసీ స్టాటింగ్ పాయింట్ వద్ద నుంచి దిగువన అడ్డగూడూరు మండలం ధర్మారం చెరువు వరకు 98.64 కిలోమీటర్ల పొడవున బునాదిగాని కాల్వను విస్తరించనున్నారు. కాల్వ అడుగుబాగాన 6.6మీటర్లు పై భాగంలో 20నుంచి 30మీటర్ల వెడల్పుతో కాల్వ విస్తరించనుంది.

తొలి విడతలో ఐదు కిలో మీటర్లు..

తొలి విడతలో బునాదిగానికాల్వ విస్తరణ పనులు జూలై 10లోగా దిగువన ఐదు కిలో మీటర్ల పొడవున ఎర్రకుంట వరకు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. బునాదిగాని కాల్వ ఆయకట్టులో జూలై 10వరకు సాగు పనులు చేసుకోవద్దని రైతులకు ఇప్పటికే సూచించి నీటి సరఫరా నిలిపివేశారు. జూలై 10 తర్వాత కాల్వ నీటిని విడుదల చేయనున్నారు. దీంతో నెల రోజులు ఆలస్యంగా ఆయకట్టులో కాల్వ పనులు తిరిగి మొదలు కానున్నాయి.

క్రాప్ హాలిడే ప్రకటించే అవకాశం

బునాదిగాని కాల్వ విస్తరణ పనుల నేపథ్యంలో వచ్చే రబీ సీజన్ ఆయ కట్టులో క్రాప్ హాలిడే ప్రకటించే అవకాశముందని సమాచారం. భూ సర్వే, విస్తరణ పనులకు ఆటంకాలు లేకుండా వేగంగా పనులు చేపట్టేందుకు ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ముందుగానే కాల్వ ఆయకట్టు గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించి సమయాత్తం చేయాలని నీటిపారుదల, రెవెన్యూశాఖ అధికారులు భావిస్తున్నారు. దీంతో 250కి పైగా ఎకరాల్లో సాగు పనులు నిలిచిపోనున్నాయి. దీంతో 250నుంచి 300 మంది రైతుల కుటుంబాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

రైతుల అంగీకారంతో భూ సేకరణ జరపాలి

కాల్వ విస్తరణ పనులకు అవసరమైన భూసేకరణ సర్వేను రైతుల అంగీకారంతో చేపట్టాలి. రైతులు సూచించిన విధంగా సర్వే చేసి మార్కెట్ రేటు నష్టపరిహారం చెల్లించాలి.ఇష్టానుసారంగా పనులు చేపడతామంటే ఊరుకునే పరిస్థితి లేదు. అడ్డుపడి తీరుతాం.
- పసులాది అంజనేయులు, రైతు మక్తానంతారం

ముమ్మరంగా కాల్వ విస్తరణ పనులు

బునాదిగాని కాల్వ విస్తరణ పనులుము మ్మరంగా కొనసాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు నష్టపోకుండా జూలై 10వరకు నీటిని నిలుపుదల చేసి పనులు చేపడుతున్నాం. తొలి విడతలో భాగంగా కాల్వ స్టాటింగ్ పాయింట్ నుంచి దిగువన ఎర్రకుంట వరకు ఐదు కిలో మీటర్ల మేర విస్తరణ పనులు పూర్తి చేసేందుకు నిర్ణయించాం. జూలై 10తర్వాత కాల్వకు నీటిని విడుదల చేస్తాం. పంటలు పూర్తయిన తర్వాత పూర్తి స్థాయి విస్తరణ పనులకు వచ్చే రబీ సీజన్‌ను క్రాప్ హాలిడే ప్రకటించే అవకాశం ఉంది.
- భరత్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ

నా గోస పట్టించుకోరూ?

భౌగోళికంగా చివర, అభివృద్ధిలోనూ తుంగతుర్తి వెనుకబాటే

పోరాటాల పురిటిగడ్డగా పేరొందిన తుంగతుర్తి నియోజకవర్గాన్ని నేను. బౌద్ధులు తిరుగాడిన నేలనయినప్పటికీ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను, తెలంగాణ మలి దశ ఉద్యమంలోనూ కాసోజు శ్రీకాంత్‌చారి లాంటి ప్రాణత్యాగాలకు వెరువని వీరులను కన్న తల్లిని నేను. ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురై పోరాడి సాధించుకున్న తెలంగాణలోనూ అభివృద్ధి చెందలేకపోయా. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే కాదు.. తొమ్మిది మండలాలు కలిగిన పెద్ద నియో జకవర్గాన్ని. స్వరాష్ట్రం ఏర్పడి 11ఏళ్లు గడిచినా నా ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదు. రాష్ట్ర ఆవిర్బావ దినోత్సవం సందర్భంగా నా గోడు.

అసంపూర్తి బునాదిగాని కాల్వ వయస్సు 20 ఏళ్లు



పూర్తికాని బునాదిగాని కాల్వ

నియోజకవర్గంలోని మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు సాగు నీరు అందించేందుకు బునాదిగాని(ధర్మారం) కాల్వ నిర్మాణానికి 2005 ఏప్రిల్ 10న ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ఎమ్మెల్యే ఉప్పునూతల పురుషోత్త మరెడ్డి కృషితో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రామన్నపేటలో శంకుస్థాపన చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక 2016లో అప్పటి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ కృషితో అప్పటి సీఎం కేసీఆర్ ఈ కాల్వకు రూ.71 కోట్లు మంజూరు చేయగా, 2017 నవంబరు 5న అప్పటి ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ మోత్కూరు మండలం పనకబండ సమీపాన మరో శిలాఫలకం వేశారు. 20 ఏళ్ల గడిచినా కాల్వ పూర్తి కాలేదు. ఎమ్మెల్యేగా మందుల సామేలు గెలిచాక ఆయన కృషితో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.266.65 కోట్లు మంజూరు చేయగా, నీటి పారుదల శాఖ కార్యదర్శి 2024 అక్టోబరు 16న నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు కూడా ఇచ్చారు. నేటికీ పనులు ప్రారంభం కాలేదు.

● 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ తిరుమలగిరి బహిరంగసభలో తుంగతుర్తి రుద్రమ్మ చెరువును రిజర్వాయర్ చేస్తానని హామీ ఇచ్చారు. ఆ చెరువును రిజర్వాయర్ చేస్తే సాగు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ప్రజల ఆకాంక్ష. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ అంశాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదు.

● మోత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని సుమారు నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు తుంగతుర్తిలో వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేసిన సందర్భంగా అప్పటి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మోత్కూరులో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మందుల సామేలు కూడా మోత్కూరులో 30పడకల ఆస్పత్రి ఏర్పాటు ఆవశ్యతను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కార్యరూపం మాత్రం దాల్చలేదు.

● నియోజకవర్గ వ్యాప్తంగా ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదు. తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక పోవడంతో ఎమ్మెల్యే సామేలు కృషితో ఈ ప్రభుత్వంలో అక్కడ జూనియర్ కళాశాల మంజూరు కాగా ఈ ఏడాది నుంచి విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. మోత్కూరు, తుంగతుర్తి మండల కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలు, మోత్కూరు, అడ్డగూడూరులో పాలిటెక్నిక్/ఐటీఐ కళాశాలలు మంజూరు చేయాలని, తిరుమలగిరి పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని నా ప్రజలు కోరుతున్నారు.

● మోత్కూరు మండలకేంద్రంలో ఆర్టీసీ బస్సు డిపో, బిక్కేరు వాగుపై శిథిలమై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయప డుతున్న బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి, మోత్కూరులో కోర్టు, అడ్డగూడూరు మండలం డి.రేపాక గ్రామంలో ఉన్న 83ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇండస్ట్రియల్ పార్కు (పరిశ్రమలు), మోత్కూరులో పోలీసు సర్కిల్ కా ర్యాలయం, మోత్కూరు రూరల్ మండలానికి డాక్టర్ స్థాయి పశు వైద్యశాల మంజూరు చేయించాలని నా ప్రజలు కోరుతున్నారు.



● తుంగతుర్తిలో వ్యవసాయ మార్కెట్, పాలక వర్గం ఉన్నా మార్కెట్ సౌకర్యం లేదు. మోత్కూరులో విశాలమైన వ్యవసాయ మార్కెట్ యార్డు ఉన్నప్పటికీ కేవలం సింగిల్‌విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుకే పరిమితమైంది. అడ్డగూడూరులో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. తుంగతర్తిలో అగ్నిమాపక కేంద్రం లేదు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు దూర ప్రాంతం నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చే సరికి జరగాల్సి నష్టం జరిగిపోతున్నది. నాగారం మండలం ఫణిగిరి బౌద్ధక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మార్చుతామని హామీ ఇవ్వడమే తప్ప అమలుకు నోచుకోవడం లేదు.

(ఆంధ్రజ్యోతి మోత్కూరు)

● ఇట్లు
తుంగతుర్తి నియోజకవర్గం

యాదగిరిగుట్టలో భక్తుల సందడి



ఉచిత దర్శన క్యూకాంప్లెక్స్‌లో భక్తుల రద్దీ



యాదగిరిగుట్ట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు ముగుస్తుండటం, వారాంతపు సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఇష్టదైవాలను దర్శించుకున్నారు. కొండకింద వైకుంఠ ద్వారం ఇరువైపుల, పాత గోశాల ప్రాంగణంలో వాహ నాలు పార్కింగ్ చేశారు. ప్రధానాలయం, శివాలయం, కల్యాణ మండపం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో కూడా కిటకిటలాడాయి. సుమారు 90వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా, ఉభయ క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు రెండు గంటలు, ధర్మదర్శనాలకు నాలుగు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. వివిధ విభాగాల నుంచి ఆలయ ఖజానాకు రూ.76, 51,701 ఆదాయం సమకూరిందని ఈవో వెంకట్రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జే. సుబ్బారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యపూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయం భువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్టస్వామి అమ్మవారికి నిత్యపూజలు నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలిం గేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు.

అధ్యాత్మిక వాడల్లో ఈవో పర్యటన

కొండపైన, కింద అధ్యాత్మిక వాడల్లో దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు పర్యటించారు. వారాంతపు రద్దీ నెలకొనగా క్యూలైన్‌లో భక్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తిరువీధులు, ప్రసాదాల విక్రయశాల, శివాలయం, కొండకింద అన్నదాన సత్రం, కల్యాణకట్టతో పాటు లక్ష్మీ పుష్కరిణిని సందర్శించారు. గుండంలోని నీరు రంగు మారడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే గుండంలోని నీటిని తొలగించి కొత్త నీటితో నింపాలని అధికారులను ఆదేశించారు. మల్లాపురంలోని గోశాలను సందర్శించి ఎన్ని గోవులు ఉన్నాయి? వాటి మేత, దాన, వాటి ఆరోగ్యం తదితరాలపై ఆరా తీశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

30 ఎకరాల భూమి సేకరించారు

గత ప్రభుత్వం 30 ఎకరాల తమ భూములను సేకరించిందని ఆలయ అభివృద్ధిలో భాగంగా క్షేత్రం ఉత్తర దిక్కులోని తమ వ్యవసాయ భూమి సేకరణతో ఉపాధి కోల్పోయామని యాదగిరిపల్లి దళితులు ఆదివారం ఈవోకు విన్నవించారు. మా పూర్వీకులు క్షేత్ర మందు వెట్టిచాకిరీ చేశారని తిరిగి మళ్లీ కులవృత్తికి సంబంధించిన టెండర్ నిర్వహించకుండా భక్తుల చెప్పుల నిర్వాహణ, డప్పులు కొట్టేందుకు అనుమతించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బూడిద సురేందర్, నర్సింహ, జానీ, నాగరాజు, స్వామి, శ్రీను, మధు, నరేష్, శివ, మిథున్‌చక్రవర్తి, మల్లేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్షేమ పథకాల జోష్

(3వ పేజీ తరువాయి)

అమలులోకి తీసుక వస్తున్నారు. రాజీవ్ యువ వికాస్‌తోపాటు గ్రామ పాలన అధికారులకు నియామక ఉత్తర్వులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు, రైతుభరోసా పెండింగ్ నిధులపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించారు. అదేవిధంగా ఉద్యోగులకు డీఏ ప్రకటన చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నారు.

రేపటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

రెవెన్యూ సేవలను సరళతరం చేయడం, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది. ఈనెల 3వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. రెవెన్యూ సదస్సుల వివరాలను ముందుగానే ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే సదస్సులకు ఒక రోజు ముందే టాంటాం ద్వారా ప్రచారం చేయనున్నారు. రెవెన్యూ సదస్సులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తారు. ప్రతీ రోజు సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో ఆ రోజు వచ్చిన దరఖాస్తులపై చర్చిస్తారు. దరఖాస్తుల డేటా కోసం ప్రత్యేకంగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రతీ మండలంలో రెండు బృందాలుగా ఏర్పడి ఒక బృందానికి తహసీల్దార్, మరో బృందానికి నాయబ్ తహసీల్దార్ నాయకత్వం వహిస్తారు. బృందంలో ఆర్ఐ, సర్వేయర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉండనున్నారు. దరఖాస్తు స్వీకరించిన తర్వాత దరఖాస్తుదారులకు రసీదు ఇవ్వడంతో పాటు దరఖాస్తులను ఆయా కేటగిరీల వారీగా విభజిస్తారు.

రైతులకు ఫౌండేషన్ సీడ్ పంపిణీ

రెవెన్యూ గ్రామాల్లో ఎంపిక చేసిన ముగ్గురు రైతులకు సోమవారం జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఫౌండేషన్ సీడ్ పంపిణీ చేయనున్నారు. అందుకు సంబంధించి వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రెవెన్యూ గ్రామాల్లో ముగ్గురు రైతుల చొప్పున ఎంపిక చేశారు. వరికి సంబంధించి రెండు కిట్లు, పెసర్లు ఒక కిట్ పంపిణీ చేస్తారు. నల్లగొండ జిల్లాలో 33 మండలాల్లో 140 క్లస్టర్లను ఎంపిక చేయగా, అందులో 564 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 564 గ్రామాలకు మొత్తం 1,692 కిట్లను పంపిణీ చేస్తారు. వీటిలో వరి విత్తనాల కిట్స్ 1128 ఉండగా, పెసర్లు 564 కిట్లు ఉన్నాయి. రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేసి విత్తన ఉత్పత్తిని సాధించడం కోసం ఫౌండేషన్ సీడ్‌ను పంపిణీ చేస్తున్నారు. మూడు జిల్లాలకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా విడుదలైంది. యాదాద్రి జిల్లాలో పంట నష్టపోయిన 1,385 ఎకరాలకు 1,029 మంది రైతులకు రూ.1,38,56,000 పరిహారం చెల్లించనున్నారు. సూర్యాపేట జిల్లాలో 1,104 ఎకరాలకు సంబంధించి 662మంది రైతులకు రూ.1,10,41,750 వారి ఖాతాలో జమ చేయనున్నారు. నల్లగొండ జిల్లాలో 726 ఎకరాలకు సంబంధించి 679మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.72.69లక్షలు మంజూరు కాగా, వీటిని ప్రభుత్వం విడుదల చేసింది.

ఆకాంక్షలు నెరవేరాలి!

(3వ పేజీ తరువాయి)

అందులో భాగమైన ఎదుల-డిండి లింక్ పనులు తక్షణం చేపట్టాలి.

● డిండి ఎత్తిపోతల పథకం పరిధిలోని ఏడు రిజర్వాయర్లు, ఎస్ఎల్బీసీ పరిధిలోని పెండ్లిపాకల, నక్కలగండి రిజర్వాయర్లలో ముంపు భూములకు పరిహారం ఇప్పించాలి.

● బ్రాహ్మణ వెల్లెంల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి నిర్ణీత లక్ష ఎకరాలకు నీరందించే పనులు వేగవంతం చేయాలి.

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న సుమారు 2,300 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలి.

● ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెరిగినందున ఇక్కడే ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలి.

● బత్తాయి, నిమ్మ రైతులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలి.

● మూసీ కాల్వలు ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, అసిఫ్‌నహర్ కాల్వల పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలి.

● గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లు పూర్తిచేయాలి. ముంపు భూములకు, నిర్వాసితులకు న్యాయబద్ధమైన పరిహారం ఇవ్వాలి.

●ఎస్ఆర్ఎస్పీ రెండో దశ కాల్వల పునరుద్ధరణ చేపట్టాలి.

● నాగార్జునసాగర్ కాల్వల మరమ్మతులు చేపట్టి వానాకాలం సాగుకు అడ్డంకులు లేకుండా చూడాలి.

● ఎత్తిపోతల పథకాల నిర్వహణకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి పథకాలు సక్రమంగా నడిచేలా చూడాలి.

● మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, నల్లగొండ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో నిర్మాణంలో ఉన్న, కొత్తగా మంజూరైన ఎత్తిపోతల పథకాల పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

● మిర్యాలగూడలో ఏరియా ఆస్పత్రి స్థాయి పెంచి 400 పడకల ఆస్పత్రిగా మార్చాలి.

● నకిరేకల్ ఏరియా ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి.

● కేతేపల్లి టోల్‌ప్లాజా వద్ద ట్రామాకేర్ ఆస్పత్రి నెలకొల్పాలి.

● ఉమ్మడి జిల్లాలోని దేవరకొండ, నాగార్జుననసాగర్, మిర్యాలగూడ, చౌటుప్పల్, నకిరేకల్, తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్‌లో నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలి.

● జాతీయ రహదారిపై చిట్యాల, నార్కట్‌పల్లి వద్ద డ్రైపోర్టులు ఏర్పాటు చేయాలి.

● నిర్మాణంలో ఉన్న ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)లను వెంటనే పూర్తిచేయాలి.

● నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరైన యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి.

●ప్రతీ నియోజకవర్గానికి ఒక స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

● స్వామి రామానంద తీర్థ గ్రామీణాభివృద్ధి సంస్థను స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీగా అవృద్ధి చేయాలి.

● ప్రతీ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల, ప్రతీ నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలి.

●మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో ఇంజనీరింగ్, లా కళాశాలలు ఏర్పాటు చేయాలి.

● తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ ఉద్యమకారుడికి 200 చదరపు గజాల ఇళ్ల స్థలం కేటాయించాలి.

8 ఎకరాలు.. 3టన్నుల ఆయిల్‌పామ్ తొలి దిగుబడి

- ●సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తోటలో కాత
- ●ఉద్యానశాఖ సూచనలతో అధిక దిగుబడులు
- ●ప్రభుత్వ ఉద్యోగిలా నెలసరి ఆదాయం వస్తుంది: ఎస్పీ నరసింహ




నల్లగొండ జిల్లా చండూరు మండలం కొండాపురం గ్రామంలో ఆయిల్ పామ్ దిగుబడిని చూపుతున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ

చండూరురూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ ఆయిల్‌పామ్ సాగులో మొదటి కోతలోనే ఎనిమిది ఎకరాల్లో మూడు టన్నుల దిగుబడి సాధించారు. స్వగ్రామం నల్లగొండ జిల్లా చండూరు మండలం కొండాపురం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ తోట సాగు చేస్తున్నారు. ఆదివారం మొదటి దిగుబడి కోయగా సుమారు 3 టన్నుల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తపల్లి నరసింహ మాట్లాడుతూ 2021-22 సంవత్సరంలో ఉద్యానశాఖ నల్లగొండ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటినట్లు తెలిపారు. మూడేళ్ల వయసులో ఆ మొక్కలు మొదటి పంట ప్రారంభమైందని, సుమారు 3టన్నుల దిగుబడి వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ఉద్యానశాఖ అధికారుల సలహాలు, సూచనలు మేరకు మేలైన యాజమాన్య పద్ధతులు, డ్రిప్ ద్వారా నీటి యాజమాన్యం పాటించి, సేంద్రీయ ఎరువుల వినియోగం ద్వారా వ్యవసాయం చేసి అధిక దిగుబడులు వచ్చాయన్నారు. నీటి వసతి కలిగిన రైతులందరూ ఆయిల్‌పామ్ సాగు చేపడితే మంచి లాభాలు పొందవచ్చని, ఎలాంటి మార్కెటింగ్ సమస్య ఎదుర్కోవాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ప్రతీ నెలా పంట దిగుబడిని తీస్తూ ప్రభుత్వ ఉద్యోగి మాదిరిగా నెలసరి ఆదాయం పొందవచ్చని సూచించారు. సాధారణంగా ఎనిమిది ఎకరాల్లో మొదటి కోతలో రెండు టన్నుల వరకే దిగుబడి వస్తుందని, మేలైన పద్ధతులు పాటించటంతో మూడు టన్నుల దిగుబడి వచ్చిందని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి తెలిపారు. మూడేళ్లలో సాగుకు రూ.2లక్షలు ఖర్చుకాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ.1లక్ష వస్తుందన్నారు. ఆయిల్‌పామ్ టన్నుకు రూ21వేలు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రతి నెల ఆయిల్ పామ్ పంట దిగుబడి వస్తుందని, దీంతో ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికారి రావుల విద్యాసాగర్, పతంజలి ఫీల్డ్ ఆఫీసర్ శ్రీను, మోహన్, రైతులు శ్రీను, శంకరమ్మ, లింగస్వామి పాల్గొన్నారు.

బుద్ధవనాన్ని సందర్శించిన థాయ్‌లాండ్ బౌద్ధ భిక్షువులు

నాగార్జునసాగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని థాయ్‌లాండ్ దేశపు బౌద్ధ భిక్షువులు, అంతర్జాతీయ నటుడు, సిద్దార్థ గౌతమ పాత్రదారి గగన్‌మాలిక్ ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించారు. నాగార్జునసాగర్‌లో తెలంగాణ టూరిజం అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన బుద్ధవనం మహాస్థూపంలో 2022 నవంబరు 29న బుద్ధుని ధాతవులను ఇండోనేషియా దేశం నుంచి తీసుకొచ్చి బహూకరించిన మహాభాగ్యం గగన్ మాలిక్‌కే దక్కుతుంది. థాయ్‌లాండ్‌కు చెందిన బౌద్ధ భిక్షువులు గుల్బర్గాను ఆదివారం సందర్శించిన అనంతరం వారితో పాటు కలిసి నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధ పాదాలు వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం బుద్ధ చరిత వనం, జాతకవనం, ధాన్యవనం, స్థూపవనాలను సందర్శించి మహాస్తంభంలోని ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు. వీరితోపాటు బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, బుద్ధవనం మేనేజర్(ఆర్ట్ మరియు ప్రమోషన్స్), స్థపతి శ్యాంసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బుద్ధవనంలో థాయ్‌లాండ్ బౌద్ధ భిక్షువులు

మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మర్రిగూడ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో సీపీఐ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ మండల కార్యదర్శి ఈదుల బిక్షంరెడ్డి అన్నారు. మండలంలోని సరంపేట గ్రామంలో ఆదివారం జక్కల యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూన్ 6వ తేదీన నిర్వహించే మండల మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నూతన గ్రామశాఖ కార్యదర్శిగా జంగిలి జంగయ్య, సహాయకార్యదర్శి దాసరి శ్రీశైలంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీడీపీ కడపర్తి గ్రామ కమిటీ నియామకం

నకిరేకల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మండలం కడపర్తి గ్రామ టీడీపీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వాడపల్లి నాగయ్య, ఉపాధ్యక్షుడు పెండెం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు షేక్ సయ్యద్‌లాల్, పందిరి సైదులు, కార్యనిర్వాహక కార్యదర్శులు మేడబోయిన యల్లయ్య, బాత్క సోమయ్య, కార్యదర్శులు గిలకత్తుల సోమయ్య, దాసరి సైదులు, గిలకత్తుల సైదులు, నక్క చంద్రగణేష్‌ను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్ తెలిపారు.

సమాచారం

భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సత్తయ్య

నల్లగొండరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మనువాదుల నుంచి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, అణచివేత, ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అన్నారు. నల్లగొండ పట్టణంలోని 11వ వార్డులోని ఎస్‌కాలనీలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ మను ధర్మశాస్త్రం పేరుతో వేల సంవత్సరాలుగా దేశంలో మెజారిటీ ప్రజలను అణచివేశారని అన్నారు. దేశంలో నేడు అదే భావజాలంతో ఉన్న మనువాద పాలకులు ప్రజలను అణచి వేసేవిధంగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షుడు దాసరి విజయ్, నాయకులు వెంకన్న, శంకర్, భూతం అరుణ కుమారి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

'మూగ' వేదన



(3వ పేజీ తరువాయి)

రూ.30లక్షల చొప్పున చెల్లించాల్సిన ప్రభుత్వం ఈ సంవత్సరం మూడునెలల కాలానికి అంటే జనవరి, ఫిబ్రవరి, మార్చి సంబంధించి నిధులు చెల్లించలేదు. దీంతో పశుసంవర్థకశాఖ ఆస్పత్రుల్లో మందుల కొరత ఉండటంతో డాక్టర్లు పశువైద్యాలకు సంబంధించి ప్రైవేట్ మందుల దుకాణాలకు ప్రిస్క్రిప్షన్ ఇస్తున్నారు. దీంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో ఆర్థిక భారమైనా ప్రైవేట్ మందుల దుకాణంలో కొనుగోలు చేస్తున్నారు.

పశువుల సంఖ్యకు అనుగుణంగా..

ప్రభుత్వం పశుసంవర్ధక శాఖను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తుందని విమర్శలు వస్తున్నాయి. పశువుల ఆస్పత్రులు సరిపడా ఉన్నా, వైద్యుల సంఖ్య సిబ్బంది అరకొరగానే ఉన్నారు. దాదాపు 225 మందికి పైగా డాక్టర్లు అవసరం ఉండగా 135 మంది మాత్రమే డాక్టర్లు ఉన్నట్లు సమాచారం. కొన్ని సబ్ సెంటర్లలో పశువైద్య ఆస్పత్రుల్లో కాంపౌండర్లతోపాటు ఇతర సిబ్బందే వైద్యం అందించాల్సి వస్తుంది. వర్షాకాలం ప్రారంభంకావడంతో పశువులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. దీంతో గ్రామాల్లో పశువుల కొట్టాల వద్దకు వెళ్లి వైద్యం అందించే పరిస్థితి లేకుండా పోయింది. ఖాళీలను భర్తీ చేయకపోవడం, పశువైద్యానికి మందులు సమకూర్చకపోవడంతోనే అనేక సమస్యలు వస్తున్నాయి. చాలా చోట్ల వైద్యం సకాలంలో అందక పశువులు మృత్యువాతపడుతున్నాయి.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



పశువైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడంతో పశువులకు వైద్యం అందడంలేదు. లంపి స్కిన్‌తో ఆవుదూడలు మృతి చెందుతున్నాయి. నట్టల నివారణ మందులు మేకలకు, గొర్రెలకు పంపిణీ చేయాలి. పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అన్ని రకాల మందులు అందుబాటులోకి తేవాలి.

- దేప సుదర్శన్‌రెడ్డి, రైతు, గొట్టిముక్కల, దేవరకొండ మండలం.

గొర్రెలు, మేకలకు మందులేవి?

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ): వ్యవసాయ పరిశ్రమకు తోడు పాడి, పశు సంపదను అభివృద్ధి చేయాల్సి ఉంది. మారిన పరిస్థితుల కారణంగా పశువులను పోషించుకోలేక రైతులు చేతులెత్తేస్తున్నారు. తక్కువ సంఖ్యలో పాడిగేదెలను, గొర్రెలు, మేకలను పెంచుతున్నా పశుగ్రాసం కొరతకు తోడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరతతో వ్యాక్సినేషన్ అందక మృత్యువాతకు గురవవుతున్నాయి. గొర్రెలు, మేకలకు ఏడాదిలో మూడు సార్లు వేయాల్సిన నట్టల నివారణ మందులు రెండున్నరేళ్లకు పైగా ప్రభుత్వం ఆస్పత్రులకు సరఫరా చేయడంలేదని గొల్ల కురుమలు ఆరోపిస్తున్నారు. వంద గొర్రెలకు లీటరున్నర డివార్మిన్ రకం మందు వేయాల్సి ఉండగా మందు నాణ్యతను బట్టి లీటరుకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు వెచ్చించాల్సి ఉంటుందని, వంద గొర్రెలకు సంవత్సరానికి రూ.5 నుంచి 6వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని గొర్రెల పెంపకందారులు పేర్కొంటున్నారు. మాడ్గులపల్లి మండలంలో తొమ్మిది మంది సిబ్బందికి ఆరుగురు మాత్రమే ఉన్నారు. మిర్యాలగూడ మండలంలో 2, వేములపల్లిలో 1, దామరచర్లలో 1, మిర్యాలగూడ మండలంలో రెండు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో గాలికుంటు వ్యాధికి వ్యాక్సినేషన్ వేసే సమయంలో సహాయకులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు డాక్టర్లు పేర్కొంటున్నారు.

వేధిస్తోన్న వైద్యులు, సిబ్బంది కొరత

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ): దేవరకొండ నియోజకవర్గంలోని పశువైద్యశాలలో వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో పశువులకు మెరుగైన వైద్యం అందడంలేదు. సరిపడా మందులు లేకపోవడంతో డాక్టర్లు పశువులకు రోగాలు వస్తే ప్రైవేట్ మందుల దుకాణాలకు మందులు రాస్తున్నారు. నియోజకవర్గంలో 10 పశువైద్యశాలలు, 15 పశువైద్య ఉపకేంద్రాలు పనిచేస్తున్నాయి. ఆసుపత్రుల్లో 10 మంది వైద్యులు, ఉండాల్సి ఉండగా, ఎనిమిది మంది విధులు నిర్వహిస్తూ మరో రెండు ఆసుపత్రులకు డిప్యుటేషన్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. 27మంది సిబ్బంది ఉపకేంద్రాల్లో ఉండాల్సి ఉన్నా, ప్రస్తుతం 15మందే విధులు నిర్వహిస్తున్నారు. అటెండర్ల పోస్టులన్నీ ఖాళీలుగా ఉన్నాయి. ఆసుపత్రుల్లో పశువులకు రోగాలు వస్తే కొన్ని ఇంజక్షన్‌లే అందుబాటులో ఉన్నాయి. నట్టల నివారణ మందులు పశువులకు ఇస్తున్నా మేకలు, గొర్రెలకు ఇవ్వడంలేదు. ఆవుదూడలకు ముద్ద చర్మవ్యాధి సోకుతుండడంతో మూడు నెలలలోపు ఆవుదూడలు నియోజకవర్గంలో ఈ సంవత్సరం ఆరు వరకు మృతి చెందాయి. చింతపల్లి, దేవరకొండ పశువైద్యశాలల్లో ఇన్‌చార్జి వైద్యులే పనిచేస్తున్నారు. కొండమల్లేపల్లిలోని పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే కురుస్తుందని డాక్టర్లు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దుకాణాలకు చేరిన రేషన్‌బియ్యం

మర్రిగూడ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు మూడు నెలలకు సంబంధించి పంపిణీ చేసేందుకు రేషన్‌బియ్యం ఆయా చౌక ధరల దుకాణాలకు చేరాయి. వర్షాకాలంలో రవాణా సమస్యలు నివారించడానికి ప్రభుత్వం లబ్ధిదారులకు మూడు నెలలకు సంబంధించిన కోటాను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జూన్, జూలై, ఆగస్టు, మూడు నెలలకు సంబంధించిన రేషన్ కోటాను సిద్ధం చేశారు. మర్రిగూడ మండలంలో 24 ప్రభుత్వ చౌకధరల దుకాణాలు ఉన్నాయి.

మొత్తం 9,559 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. మూడు నెలలకు గాను 4,740 క్వింటాళ్ల బియ్యం పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఈ బియ్యాన్ని జూన్ 1వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

మర్రిగూడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధికి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన గుండ్ల కృష్ణవేణి కుటుంబాన్ని పరామర్శించి లెంకలపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ ఐతగోని రేణుకవెంకన్నగౌడ్ రూ.10వేల ఆర్థికసాయం అందజేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట మేతరి బంగారం, దేవదాస్, యాదగిరి, గిరి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే నా బలగం : కోమటిరెడ్డి

● *నియోజకవర్గంలో ఘనంగా జన్మదిన వేడుకలు*

మర్రిగూడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే నా బలం బలగమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మర్రిగూడ మండల కేంద్రంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు అధైర్యపడవద్దని, మీకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు జరిగే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, నాయకులు మేతరి యాదయ్య, బాలయ్య, రమావత్ శ్రీనివాస్, వెంకటేష్, నగేష్, ఐతగోని వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, జగాల్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.



నాంపల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునుగోడు: మునుగోడులో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రక్తదానం చేసిన యువకులకు అభినందన పత్రాలను అందజేశారు. క్యాంపు కార్యాలయ ఆవరణలో నాయకులతో కలిసి ఎమ్మెల్యే మొక్కను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అభిమానులు, కార్యకర్తలకు స్వయంగా వడ్డించారు. అంతకు ముందు పట్టణంలోని శివరామక్షేత్రంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ పున్న కైలాష్‌నేత, మాజీ అధికార ప్రతినిధి నారబోయిన రవిముదిరాజ్, జక్కలి ఐలయ్యయాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, వట్టికోటి శేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, అన్వర్, నాగరాజు పాల్గొన్నారు.

● నాంపల్లిలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాం గ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అం బేడ్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కా ర్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, నాయకులు కుంభం కృష్ణారెడ్డి, పూల వెంకటయ్య, గట్టుపల్లి నర్సిరెడ్డి, ఎరెడ్ల రఘుపతిరెడ్డి, పెద్దిరెడ్డి రాజు, పనాగంటి వెంకటయ్య ఉన్నారు.



మర్రిగూడలో పుట్టినరోజు వేడుకల్లో ఫైర్ గన్నులను పేల్చుతున్న రాజగోపాల్‌రెడ్డి



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి నోట్‌బుక్స్ అందజేస్తున్న కర్నాటి శ్రీనివాస్

● గట్టుప్పల్ మండలకేంద్రంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దండు యాదగిరిరెడ్డి, నాయకులు సామల యాదయ్య, రావుల రమేష్, వీరమల్ల శ్రీశైలం, బుచ్చయ్య, మల్లేశం పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్నాటి శ్రీనివాస్ మునుగోడులో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు.

భూ సేకరణకు రైతులు సహకరించాలి: ఆర్డీవో



రైతులకు చెక్కులు అందజేస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

నార్కట్‌పల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఉదయ సముద్రం ప్రాజెక్టు కాల్వల తవ్వకం కోసం భూ సేకరణకు రైతులు సహకరించాలని ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి అన్నారు. బీ.వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టులో భాగంగా కాల్వల తవ్వకంలో భూమిని కోల్పోతున్న మండలంలోని నెమ్మాని గ్రామస్తులకు సుమారు రూ.14లక్షల నష్టపరిహారం విడుదలైంది. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బాధిత రైతులకు ఆయన చెక్కులను అందజేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ సామూహిక ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాల భూ సేకరణకు రైతులు కొంత త్యాగానికి సిద్ధపడాలని కోరారు. కార్యక్రమంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, పల్లె నరేందర్‌రెడ్డి ఆర్‌ఐలు తరుణ్, ఎస్‌రాజు, ఐబీ ఏఈఈలు అంజనేయులు, రాజశేఖర్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత



ఆలయంలో ఎమ్మెల్సీ సత్యంను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గట్టుప్పల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని కంఠమహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఆదివారం ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆధ్యాత్మికతతో పల్లెల్లో ప్రశాంత వాతావరణ ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బండారు చంద్రయ్యగౌడ్, వడ్డేపల్లి గోపాల్‌గౌడ్, పెద్దగాని రాఘవేంద్రగౌడ్, మాదగాని శంకర్‌గౌడ్, సాయిల్‌గౌడ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజ రామచంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, నాయకులు జగన్నాథం, రమేష్, సత్తయ్య, ధనుంజయ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం

నాంపల్లి: మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి దేవాలయాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్ ఆదివారం సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కోసం రూ.2.16 లక్షలు దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట రఘునందన్, ప్రధాన కార్యదర్శి ఆలంపల్లి ఆనంద్‌కుమార్, గోలి కృష్ణ, వెంకటేశ్వర్లు, గణేష్, ఖైరత్‌జాన్, అనంతరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

మాస్ సేవలు అభినందనీయం



మాస్ సంఘానికి విరాళం అందిస్తున్న శంకరానందస్వామి

రామగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయ సాధన సేవా సంఘం (మాస్) చేస్తున్న సేవలు అభినందనీయమని శంఖరానందగిరి స్వామిజీ అన్నారు. మాదిగ సం ఘాల జేఏసీ, మాస్ సేవా సంఘం నాయకులు, పట్టణంలో హిందూపూర్‌లో ఉన్న శంకరానంద ఆశ్రమంలో ఉన్న గురూజీని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నిరుపేద, ఎస్సీ కుటుంబాల చెందిన వారు శివైక్యం చెందితే మాస్ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆశ్రమం తరఫున ప్రతీ నెలా రూ.1000 చొప్పున ఆరునెలల ఇవ్వనున్నట్లు తెలిపారు. మాస్ సంఘం అధ్యక్షుడు పెరిక ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో నల్లగొండకు వచ్చిన మంత్రి రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమాల్లో సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు దుబ్బ రూప, ఉపాధ్యక్షుడు అంజయ్య, అశోక్, శివరామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

వలస కార్మికుల రక్షణ చట్టాన్ని అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సలీం

నల్లగొండరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వలస కార్మికుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన కార్మిక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమురయ్య భవనంలో ఆదివారం భవన నిర్మాణ, ఇతర నిర్మాణరంగంలో పనిచేస్తున్న వలస కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ ప్రాంతాల్లో ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వస్తున్న కార్మికుల సంఖ్యను లేబర్ అధికారులు నమోదు చే యాలని అన్నారు. యాజమాన్యాలు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించి దోపిడికి గురికాకుండా చూడాలని కోరారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో వలస కార్మికులందరినీ నమోదు చేసీ సంక్షేమ పథకాలు అందే విధంగా కార్మికశాఖ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు సయ్యద్ హాషం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్, నాయకులు సైదచారి, అద్దంకి నర్సింహ, అశోక్ గుప్తా, సూరట్ పటేల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును విరమించుకోవాలి

నల్లగొండ టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సర్దుబాటుకు కలెక్టర్లకు అధికారం ఇస్తూ పాఠశాల విద్యాశాఖ జారీచేసిన ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటేశం, పి.వెంకులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెబుతూ, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య కుదింపునకు ఉత్తర్వులు జారీ చేయడమేంటని ప్రశ్నించారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు, అధికారులకు శిక్షణ, బడిబాట పేరుతో కార్యక్రమాలు చేపడుతూ మరోవైపు పిల్లలు తక్కువగా ఉన్నారనే ఉద్దేశంతో ఉపాధ్యాయులను వేరే పాఠశాలలకు సర్దుబాటు చేయడం ద్వారా ప్రాథమిక విద్యపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. వెంటనే సర్దుబాటు ఉత్తర్వులను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే వీరేశం పుట్టినరోజు వేడుకలు



నకిరేకల్‌లో వీరేశం జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే కుమార్తె వినూత్నకు తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నకిరేకల్, చిట్యాల, చిట్యాల రూరల్, నార్కట్‌పల్లి, కట్టంగూరు, కేతేపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వేముల వీరేశం పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నకిరేకల్‌లో ఘనంగా నిర్వహించారు. పన్నాలగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మెయిన్ సెంటర్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కుమారుడు విపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ క్రీడా పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బి.శ్రీదేవిగంగాధర్ రావు, ఎమ్మెల్యే కుమార్తె వినూత్న, పార్టీ మండల అధ్యక్షుడు ఏసుపాదం, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మండల కేంద్రంలో, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. బాణసంచా కాల్చి, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పోకల దేవాస్, జడల చినమల్లయ్య, మాజీ మార్కెట్ చైర్మన్లు కాటం వెంకటేశం, పందిరి శ్రీనివాస్, గుడిపాటి లక్ష్మీనర్సు, ఏర్పుల పరమేశం, వనమా వెంకటేశ్వర్లు, కోనేటి యాదగిరి, చెరుకు, సైదులు, పోలగోని స్వామి, బుద్ధుడు పట్ల జనార్ధన్, జనగాం రవీందర్‌గౌడ్, వడ్డెపల్లి లక్ష్మీపతి, రఘమారెడ్డి పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే వేముల వీరేశం తన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. వీరేశంకు సీఎం రేవంత్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో బండ సాగర్‌రెడ్డి, అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, బత్తుల ఊశయ్య, దూదిమెట్ల సత్తయ్య, అయితరాజు యాదయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరు, కేతేపల్లి మండలాల్లో నిర్వహించిన ఎమ్మెల్యే వీరేశం పుట్టినరోజు వేడుకల్లో నాయకులు గుత్తా మంజుల మాధవరెడ్డి, కె.శ్రీనివాసయాదవ్, ఎస్‌కె.లతీఫ్, బయ్య ముత్తయ్య, జె.ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మావోయిస్టులతో
శాంతి చర్చలు నిర్వహించాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య

మునుగోడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోయిస్టులతో కేంద్రప్రభుత్వం తక్షణమే శాంతి చర్చలు నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మునుగోడులో జరిగిన సంఘం మహాసభలో ఆయన మాట్లాడారు. శాంతియుత వాతావరణం కోసం మావోయిస్టులు శాంతి చర్చలకు ముందుకు వస్తుండగా, కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలు, మావోయిస్టులను నిర్మూలించాలనే ఉద్దేశంతో హత్యాకాండ కొనసాగించడం శోచనీయమన్నారు. ఈ చర్యలు ప్రజాస్వామ్య మనుగడకు విఘాతమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించాలన్నారు.

బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించకపోవడంతో ఈ పథకం నిర్వీర్యమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ, నాయకులు చాపల శ్రీను, ఎండీ.జానీమియా, ఊషయ్య, రమేష్, కాయితి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగులు సామాజిక బాధ్యతతో పనిచేయాలి

● *ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య*



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, వేదికపై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, యాదవ సంఘం నాయకులు

నల్లగొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): యాదవ ఉద్యోగులు సా మాజిక బాధ్యతతో పనిచేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొ ని మాట్లాడారు. యాదవ ఉద్యోగులందరూ నీతి, నిజాయతీతో అంకితభావంతో పనిచేసి వృత్తి గౌరవాన్ని కాపాడాలన్నారు. పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు పొందాలంటే చాలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే బడుగు, బలహీన వర్గాలకు అండగా భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడినట్లు తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, వర్రె వెంకటేశ్వర్లు మా ట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు జవాబుదారీతనంతో పనిచేయాలని, ప్రజాస్వామ్య పరిపాలనకు ఒక మెట్టు లాటిందన్నారు. యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తరాల పరమేష్‌యాదవ్ అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో నాయకులు అర్వ అశోక్, బెల్లి యాదయ్య, లోడంగి గోవర్ధన్, ముచ్చర్ల ఏడుకొండలు, దూదిమెట్ల బాలరాజు, పిల్లి రామరాజు యాదవ్, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి 100 రోజుల ప్రణాళిక
● సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు ● సంక్షేమ పథకాల వర్తింపు లక్ష్యం 4



ఆకాంక్షలు నెరవేరాలి!

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రజల వేడుకోలు

నల్లగొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజల ఆకాంక్షల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఉమ్మడి జిల్లా వాసులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసే పెండింగ్ ప్రాజెక్టులు, కాల్వలు, ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను పూర్తిచేయాలని కోరుతున్నారు. జిల్లాలో సాగయ్యే ఉద్యాన పంటల ప్రాసెసింగ్ పరిశ్రమలు, మార్కెటింగ్ సదుపాయలు కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేయాలంటున్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో విద్య, వైద్యరంగాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. యువతకు ఉపాధి కల్పించేలా పరిశ్రమల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల ఆకాంక్షలను మననం చేసుకొని వాటి సాధనకు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశిస్తున్నవి ఇవే..

- ఎస్ఎల్బీసీ సొరంగమార్గం పూర్తి చేసి ప్రతిపాదిత 3.50లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలి.
- ఎస్ఎల్బీసీ(ఏఎమ్మార్పీ) హైలెవెల్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో లైనింగ్ పూర్తి చేయించాలి. ఆయకట్టు చివరి భూములకు నీరందేలా చర్యలు తీసుకోవాలి.
- డిండి ఎత్తిపోతల పూర్తి చేసి ప్రతిపాదిత దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని 3.50లక్షల ఎకరాలకు నీరివ్వాలి.

- మిగతా 5వ పేజీలో...





నేటి నుంచి సంక్షేమ పథకాల జోష్

- అవతరణ దినోత్సవం నేపథ్యంలో కొత్త పథకాలు
- రాజీవ్ యువ వికాసానికి ప్రొసీడింగ్స్
- రైతులకు ఫౌండేషన్ సీడ్ పంపిణీ
- గ్రామపాలన అధికారులకు నియామక ఉత్తర్వులు
- రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

నల్లగొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం కొత్త సంక్షేమ పథకాలను అమలు చేయనుంది. ప్రధానంగా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. యువత సాధికారత, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడమే లక్ష్యంతో రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రూపొందించింది. పథకంలో భాగంగా రూ. లక్షలోపు సబ్సిడీని తొలివిడత అందజేయనున్నారు.ప్రతి నెలా విడతల వారీగా ఈ పథకాన్ని అమలు చేస్తారు. అక్టోబరు 2 నాటికి లబ్ధిదారులందరికీ అందజేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూన్ మొదటి వారంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇళ్లను ప్రారంభిస్తారు. పనులు జరుగుతున్న తీరును బట్టి లబ్ధిదారులకు విడతల వారీగా నిధులు మంజూరు చేస్తారు. జూన్ మొదటి వారంలో కొందరూ గృహప్రవేశం చేసేందుకు ఏర్పాట్లు కూడా జరిగాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొత్త పథకాలను వేగవంతం చేయాలని నిర్ణయించి ఆయా పథకాలను...

- మిగతా 5వ పేజీలో...

నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు

పరేడ్ గ్రౌండ్ ముస్తాబు



నల్లగొండ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పేరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. తొలుత పోలీసులు గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న పలు సంక్షేమ పథకాలను మంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారు. అదేవిధంగా వివిధ శాఖలు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన స్టాళ్లను మంత్రి సందర్శించనున్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ



కనగల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద ఉన్న శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి చీరసారె, ఒడిబియ్యం నైవేద్యాలను సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి



ప్రచారజాతాను ప్రారంభిస్తున్న చావా రవి

నల్లగొండ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య పొందాలని, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపు కోసం యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జాతాను ఆదివారం జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. విశాలమైన తరగతి గదులు, ఆటస్థలాలు ఉన్నాయని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన ఉచిత విద్యను పొందాలన్నారు. సంపాదనలో సగానికి పైగా పిల్లల చదువుల కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే సమాజానికి నష్టమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో కత్తుల రవీందర్, సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్కా శ్రీనివాస్‌చారి, పెరుమాళ్ల వెంకటేశం, నాయకులు ఎడ్ల సైదులు, జి.అరుణ, సరళ, వి.జగదీష్‌బాబు, భద్రీనాథ్, మంగ్త నాయక్, గేరా నరసింహ, నల్లప రాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమర సైదులు, ఎం.మురళయ్య, కె.మధుసూదన్, ఎర్రనాగుల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

మూగ వేదన

- నిధుల్లేవు.. మందులు రావు..
- మూగజీవాలను పట్టించుకోని ప్రభుత్వం
- పశువైద్యానికి మందులు కరువు
- సంవత్సరానికి రావాల్సింది రూ.1.20 కోట్లకు పైగా నిధులు
- గత సంవత్సరంలో రూ.30లక్షల నిధులే విడుదల
- ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా ఇవ్వలే
- పశువైద్యం అందక రైతులు, జీవాల పెంపకదారుల ఇబ్బందులు

దేశానికి రైతే వెన్నుముక. ఆ రైతుకు వెన్నుముక పశుసంపద. నేడు ఆ వెన్ను విరిగి, రైతుల పరిస్థితి దీనంగా మారుతోంది. కంటికి రెప్పలా, ఇంట్లో సభ్యుల మాదిరి కాపాడుకుంటున్న పశుసంపదకు ఆపదొస్తే ఆదుకునే వారు లేక కర్షకులు అతలాకుతలమవుతున్నారు. పశువులకు కనీసం తినేందుకు మేత కరువై, రోగమొస్తే మందులు లేక, అత్యవసరమైతే ఆస్పత్రిలో వైద్యుడు లేక ఆ మూగ జీవాలు రోదిస్తున్న తీరు చూసి రైతు కంటతడి ఆరడంలేదు. జిల్లావ్యాప్తంగా పశువైద్యశాలలు అలంకార ప్రాయంగా మారాయన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడం, వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండడం, అటెండర్లే వైద్యులుగా మారుతుండడం అగమ్యగోచరంగా మారింది.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)





జిల్లాకేంద్రంలోని పశుగణాభివృద్ధి కార్యాలయం, మేకలకు ఇంజక్షన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

జిల్లాలో పశువైద్యానికి మందులు కరువయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్థకశాఖకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. పశుసంవర్థక శాఖలో ప్రయోగశాలలు నామమాత్రంగా మారాయి. దీంతో పాడి రైతులు, జీవాల పెంపకదారులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు రక్త, మూత్ర, తదితర పరీక్షలతో పాటు ఎక్స్‌రేలు తీయాలన్నా ఆ వసతులు లేక రైతులు నానా తంటాలు పడుతున్నారు. పెంపుడు జంతువుల విషయానికొస్తే పట్టణ, మండలాల్లో వివిధ రకాల కుక్క పిల్లలను పెంచుతున్నారు. ఇందులో ప్రధానంగా ల్యాబ్, సిజ్, పేమేరియన్, జర్మన్ షపర్డ్, రాట్ వీలర్, స్పిట్స్ వంటి జాతులను యజమానులు ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్నారు. ఎలాంటి జబ్బులొస్తున్నా వాటికి వైద్యం అందడంలేదన్న ఆరోపణలున్నాయి. నల్లగొండ జిల్లాలో ఐదు ఏరియా ఆస్పత్రులు, 46 పశువైద్య ఆస్పత్రులు, 59 సబ్ సెంటర్లున్నాయి. అయితే ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పెంపుడు జంతువులకు అనుగుణంగా వైద్యం అందడంలేదు. నల్లగొండ జిల్లాలో గత పశుగణన లెక్కల ప్రకారం 2లక్షలకు పైగా ఆవులు, 3.37లక్షల గేదెలు, 11.16లక్షల గొర్రెలు, 3.41లక్షల మేకలు, 60 నుంచి 70లక్షలకు పైగా కోళ్లు, 16,500కుపైగా పెంపుడు జంతువులున్నాయి. వీటిన్నంటికీ వైద్యం అందించాలంటే ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సి ఉంది. ఇకపోతే ఇప్పటివరకు ఇటీవల చేపట్టిన పశుగణన లెక్కకూడా సంబంధిత అధికారుల వద్ద లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

నల్లగొండ జిల్లాలో పశుగణన

ఆవులు	2లక్షలుపైగా
గేదెలు	3.37లక్షలు
గొర్రెలు	11.16లక్షలు
మేకలు	3.41లక్షలు
కోళ్లు	70లక్షలు
పెంపుడు జంతువులు	16,500

విడుదలైందని రూ.30లక్షలే

రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం జిల్లాకు రూ.1.20కోట్లకుపైగా మందుల కొనుగోలుకు నిధులు కేటాయించాల్సి ఉంటుంది. దాదాపు 30 నుంచి 40రకాలకు పైగా మందులను కొనుగోలు చేసి వైద్య సేవలందించాలి. కానీ గత సంవత్సరం కేవలం రూ.30లక్షలే నిధులు విడుదలయ్యాయి. మిగతా తొమ్మిది నెలల కాలానికి ఒక్క రూపాయి కూడా రాలేదు. అయితే ప్రతీ మూడు నెలలకోసారి (క్వార్టర్లీ) రూ.30లక్షలు వైద్య ఆరోగ్యశాఖకు ఇస్తే మందులను కొనుగోలు చేసి వైద్యం అందిస్తారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్కరూపాయి కూడా సమకూర్చలేదు. క్వార్టర్లీ

మిగతా 6వ పేజీలో..

నిధులు రాగానే కొనుగోలు చేస్తాం



గత సంవత్సరానికి సంబంధించి మూడు నెలలకు రూ.30లక్షల వరకు వచ్చాయి. ప్రభుత్వం మందుల కొనుగోలుకు నిధులు విడుదల చేసిన వెంటనే మందులను సేకరించి వైద్య సేవలకు కేటాయిస్తాం. దాదాపు 30 నుంచి 40 రకాల మందులను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం నిధులు కూడా రాగానే వైద్య సేవలకు వెచ్చిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పశువైద్యానికి కృషి చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు సత్వర సేవలు అందుతున్నాయి.

జీవీ రమేష్, నల్లగొండ జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

సిద్ధమైన నిడమనూరు మున్సిఫ్‌కోర్టు



నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న హైకోర్టు సీజే

నిడమనూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలో రూ.5.50కోట్ల నిధుల వ్యయంతో నిర్మించిన మున్సిఫ్ కోర్టు(జూనియర్ సివిల్ జడ్జి కోర్టు) భవన సముదాయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మూడేళ్లుగా సాగిన కోర్టు నిర్మాణ పనులు పూర్తికాగా, కోర్టు భవనాన్ని హైకోర్టు సీజే సోమవారం ఉదయం 10.30 గంటలకు సుజోయ్ పాల్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నిడమనూరు, హాలియా, పెద్దవూర, తిరుమలగిరిసాగర్, త్రిపురారం మండలాలకు చెందిన కేసులను గతంలో మిర్యాలగూడ కోర్టులో విచారించేవారు. కక్షిదారులు, న్యాయవాదులకు ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా, నిడమనూరులో మున్సిఫ్ కోర్టును ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. చివరికి 2015 ఆగస్టు 16న అప్పటి హైకోర్టు న్యాయమూర్తులు యడవెల్లి రాజశేఖర్‌రెడ్డి, చల్లా కోదండరామ్ నిడమనూరులో మున్సిఫ్‌కోర్టును ప్రారంభించారు. అయితే నాటి నుంచి సొంత భవనం లేక మండల పరిషత్ కాంప్లెక్స్ కార్యాలయంలో అద్దె ప్రాతిపదికన పదేళ్లుగా కోర్టును నిర్వహిస్తూ వచ్చారు. పక్కా భవనం కోసం ఎన్నెస్పీ క్యాంపు ఆవరణలో 230 సర్వే నెంబరులో 32గుంటల భూమిని 2016లో అధికారులు కేటాయించగా, మూడేళ్ల క్రితం గత ప్రభుత్వం రూ.5.50కోట్లు మంజూరు చేయడంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కోర్టు హాలు, న్యాయవాదుల ఛాంబర్, గదులు, జడ్జి నివాసానికి క్వార్టర్‌ను నిర్మించారు. కాగా, కోర్టు భవన ప్రారంభోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉన్నం చినవీరయ్య కోరారు.

వర్గీకరణతో మాదిగలకు, ఉపకులాలకు న్యాయం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



మంత్రి దామోదర్ రాజనర్సింహ, మాజీ మంత్రి జానారెడ్డిని సన్మానిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య

నల్లగొండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుతో రాష్ట్రంలో మాదిగలు, మాది గ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సిం హ అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలైన తర్వాత ఆదివారం తొలిసారిగా జిల్లాకేంద్రానికి వచ్చిన సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య ఆధ్వర్యంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో మాదిగలు, మాదిగ ఉపకులాలకు ఎంతగానో న్యాయం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి పథకాలు అమలవుతున్నాయన్నారు. అనంతరం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, మాదిగ జేఏసీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, ఎమ్మార్పీఎస్, ఎమ్మార్పీఎస్ ఉపకులాలు, మాదిగ జేఏసీ నాయకులు పెరిక ఉమామహేశ్వర్, కత్తుల జగన్, కత్తుల తులసీదాస్, దుబ్బ రూప అశోక్ సుందర్, తలకొప్పుల గిరి, షణ్ముక, భాషపాక హరికృష్ణ, నవీన్, హరిప్రసాద్, కొప్పు అశోక్, నరేందర్, ప్రసాద్, అశ్విని, అంజమ్మ, రుద్ర పాల్గొన్నారు.

పాలకులు మారినా ఎజెండా మారలేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి

మిర్యాలగూడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్రంలో 11 ఏళ్ల పాలకులు మారినా వారి ఎజెండా మారలేదని, రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై వివక్ష చూపుతోందని అన్నారు. విపక్ష పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులు కేటాయించడంలేదని, విభజన హామీలను అమలు చేయడంలేదన్నారు. రాష్ట్రంలో పాలకులు మారినా విధానాలు మారడం లేదన్నారు. పేదలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేసి ప్రజా సంక్షేమంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. మహాలక్ష్మి పథకం, పెంచిన పెన్షన్‌లను, రైతుభరోసా, నిరుద్యోగభృతి అమలుచేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యారంగాలపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. గ్రామపంచాయితీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించానలి, రాష్ట్రంలో 1.20కోట్ల మంది అసంఘంటితరంగ కార్మికులు ఉన్నారని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, బవాండ్ల పాండు, పాదూరి వవిధర్‌రెడ్డి, పారేపల్లి సత్యనారాయణరావు, లింగయ్య, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం



విలేకరులతో మాట్లాడుతున్న గోలి మధుసూదన్‌రెడ్డి

రామగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని గట్టెక్కించేందుకు ప్రధాన మంత్రి కిసాన్ సమాన్ నిధి కింద ప్రతీ రైతుకు రూ.6వేల ఇస్తుందన్నారు. అదేవిధంగా ఎరువులు అందుబాటులోకి తేవడంతో పాటు ఫసల్ బీమా పథకం అమలు చేస్తుందన్నారు. పంటలకు మద్దతు ధరలు రెట్టింపు చేయడంతో పాటు భూసార పరీక్షలు, పొలాల వద్దకు అంతర్గత రోడ్ల నిర్మాణం, గోదాములు, కల్లాల నిర్మాణం, విద్యుత్ ఉత్పత్తి పెంపుదల, రైతులకు అధిక దిగుబడులు ఇచ్చే నూతన పంట విత్తనాల అభివృద్ధి, నూతన డెయిరీలకు 50 శాతం సబ్సిడీ పథకాలను అమలు చేస్తుందని వివరించారు. ప్రకృతి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బీపంగి జగ్జీవన్‌రాం, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి తిరుమల మహేష్, ప్రధాన కార్యదర్శి కటికం శ్రీధర్, తరాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా చిత్రియాల నాగేంద్ర

దేవరకొండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణ బీజేపీ ప్రధానకార్యదర్శిగా చిత్రియాల నాగేంద్రను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు వస్కుల సుధాకర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ పట్టణంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తన నియమకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగులకు సకాలంలో వేతనాలిప్పించాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పలు శాఖల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు నెలల తరబడి వేతనాలందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా విద్యాసంస్థలు, సంక్షేమ భవనాల్లో విధులు నిర్వహించే సిబ్బంది వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

హాలియా, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అనుముల మండలానికి 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పీఏసీఎస్ కొత్తపల్లి కేంద్రం అందుబాటులో ఉన్నట్లు ఏవో సరిత ఆదివారం తెలిపారు. రైతులు తమ క్లస్టర్ పరిధి వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి పాస్‌బుక్, ఆధార్ జీరాక్స్‌లు అందజేసి పర్మిట్‌ను పొందాలని సూచించారు. జీలుగ 54 క్వింటాళ్లు ఉండగా సబ్సిడీపై ధర రూ. 2,137, జనుము 30 క్వింటాళ్ల స్టాక్ ఉండగా సబ్సిడీపై ధర రూ. 2510 అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'మూగ' వేదన




(3వ పేజీ తరువాయి)

రూ.30లక్షల చొప్పున చెల్లించాల్సిన ప్రభుత్వం ఈ సంవత్సరం మూడునెలల కాలానికి అంటే జనవరి, ఫిబ్రవరి, మార్చి సంబంధించి నిధులు చెల్లించలేదు. దీంతో పశుసంవర్ధకశాఖ ఆస్పత్రుల్లో మందుల కొరత ఉండటంతో డాక్టర్లు పశువైద్యాలకు సంబంధించి ప్రైవేట్ మందుల దుకాణాలకు ప్రిస్కిప్షన్ ఇస్తున్నారు. దీంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో ఆర్థిక భారమైనా ప్రైవేట్ మందుల దుకాణంలో కొనుగోలు చేస్తున్నారు.

పశువుల సంఖ్యకు అనుగుణంగా..

ప్రభుత్వం పశుసంవర్ధక శాఖను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తుందని విమర్శలు వస్తున్నాయి. పశువుల ఆస్పత్రులు సరిపడా ఉన్నా, వైద్యుల సంఖ్య సిబ్బంది అరకొరగానే ఉన్నారు. దాదాపు 225 మందికి పైగా డాక్టర్లు అవసరం ఉండగా 135 మంది మాత్రమే డాక్టర్లు ఉన్నట్లు సమాచారం. కొన్ని సబ్ సెంటర్లలో పశువైద్య ఆస్పత్రుల్లో కాంపౌండర్లతోపాటు ఇతర సిబ్బందే వైద్యం అందించాల్సి వస్తుంది. వర్షాకాలం ప్రారంభంకావడంతో పశువులు రోగాల భారిన పడే ప్రమాదం ఉంది. దీంతో గ్రామాల్లో పశువుల కొట్టాల వద్దకు వెళ్లి వైద్యం అందించే పరిస్థితి లేకుండా పోయింది. ఖాళీలను భర్తీ చేయకపోవడం, పశువైద్యానికి మందులు సమకూర్చకపోవడంతోనే అనేక సమస్యలు వస్తున్నాయి. చాలా చోట్ల వైద్యం సకాలంలో అందక పశువులు మృత్యువాతపడుతున్నాయి.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



పశువైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడంతో పశువులకు వైద్యం అందడంలేదు. లంపి స్కిన్‌తో ఆవుదూడలు మృతి చెందుతున్నాయి. నట్టల నివారణ మందులు మేకలకు, గొర్రెలకు పంపిణీ చేయాలి. పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అన్ని రకాల మందులు అందుబాటులోకి తేవాలి.

- దేప సుదర్శన్‌రెడ్డి, రైతు, గొట్టిముక్కల, దేవరకొండ మండలం.

గొర్రెలు, మేకలకు మందులేవి?

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ): వ్యవసాయ పరిశ్రమకు తోడు పాడి, పశు సంపదను అభివృద్ధి చేయాల్సి ఉంది. మారిన పరిస్థితుల కారణంగా పశువులను పోషించుకోలేక రైతులు చేతులెత్తేస్తున్నారు. తక్కువ సంఖ్యలో పాడిగేదెలను, గొర్రెలు, మేకలను పెంచుతున్నా పశుగ్రాసం కొరతకు తోడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరతతో వ్యాక్సినేషన్ అందక మృత్యువాతకు గురవవుతున్నాయి. గొర్రెలు, మేకలకు ఏడాదిలో మూడు సార్లు వేయాల్సిన నట్టల నివారణ మందులు రెండున్నరేళ్లకు పైగా ప్రభుత్వం ఆస్పత్రులకు సరఫరా చేయడం లేదని గొల్ల కురుమలు ఆరోపిస్తున్నారు. వంద గొర్రెలకు లీటరున్నర డివార్మిన్ రకం మందు వేయాల్సి ఉండగా మందు నాణ్యతను బట్టి లీటరుకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు వెచ్చించాల్సి ఉంటుందని, వంద గొర్రెలకు సంవత్సరానికి రూ.5 నుంచి 6వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని గొర్రెల పెంపకందారులు పేర్కొంటున్నారు. మాడ్గులపల్లి మండలంలో తొమ్మిది మంది సిబ్బందికి ఆరుగురు మాత్రమే ఉన్నారు. మిర్యాలగూడ మండలంలో 2, వేములపల్లిలో 1, దామరచర్లలో 1, మిర్యాలగూడ మండలంలో రెండు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో గాలికుంటు వ్యాధికి వ్యాక్సినేషన్ వేసే సమయంలో సహాయకులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు డాక్టర్లు పేర్కొంటున్నారు.

వేధిస్తోన్న వైద్యులు, సిబ్బంది కొరత

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ): దేవరకొండ నియోజకవర్గంలోని పశువైద్యశాలలో వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో పశువులకు మెరుగైన వైద్యం అందడంలేదు. సరిపడా మందులు లేకపోవడంతో డాక్టర్లు పశువులకు రోగాలు వస్తే ప్రైవేట్ మందుల దుకాణాలకు మందులు రాస్తున్నారు. నియోజకవర్గంలో 10 పశువైద్యశాలలు, 15 పశువైద్య ఉపకేంద్రాలు పనిచేస్తున్నాయి. ఆసుపత్రుల్లో 10 మంది వైద్యులు, ఉండాల్సి ఉండగా, ఎనిమిది మంది విధులు నిర్వహిస్తూ మరో రెండు ఆసుపత్రులకు డిప్యుటేషన్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. 27మంది సిబ్బంది ఉపకేంద్రాల్లో ఉండాల్సి ఉన్నా, ప్రస్తుతం 15మందే విధులు నిర్వహిస్తున్నారు. అటెండర్ల పోస్టులన్నీ ఖాళీలుగా ఉన్నాయి. ఆసుపత్రుల్లో పశువులకు రోగాలు వస్తే కొన్ని ఇంజక్షన్‌లే అందుబాటులో ఉన్నాయి. నట్టల నివారణ మందులు పశువులకు ఇస్తున్నా మేకలు, గొర్రెలకు ఇవ్వడంలేదు. ఆవుదూడలకు ముద్ద చర్మవ్యాధి సోకుతుండడంతో మూడు నెలలలోపు ఆవుదూడలు నియోజకవర్గంలో ఈ సంవత్సరం ఆరు వరకు మృతి చెందాయి. చింతపల్లి, దేవరకొండ పశువైద్యశాలల్లో ఇన్‌చార్జి వైద్యులే పనిచేస్తున్నారు. కొండమల్లేపల్లిలోని పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే కురుస్తుందని డాక్టర్లు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు సకల జనుల సమైక్య ర్యాలీ

మిర్యాలగూడ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా కుల, మతాలకతీతంగా సకల జనుల సమైక్య ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. జూన్ 2 సోమవారం ఉదయం 8.30 గం టలకు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జాతీ య పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ర్యాలీ నిర్వహించనున్న ట్లు పేర్కొన్నారు. ర్యాలీలో నియోజకవర్గ నాయకులు, ప్రైవేట్, ప్రభుత్వరంగ ఉద్యోగులు, విద్యార్థు లు, వ్యాపారస్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీ లో ఎమ్మె ల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు.

నియోజకవర్గానికి గుర్తింపు తీసుకురావాలి

● ఎమ్మెల్యే బీఎల్‌ఆర్



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బత్తు లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్య, క్రీడ, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించి నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. కాశీ, అయోధ్య ఆధ్యాత్మిక నగరాలతో పాటు నమో ఘాట్‌లో ఆంధ్ర నాట్య నృత్య ప్రదర్శన చేసిన పట్టణ విద్యార్థులను అభినందించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణానికి చెందిన నాటరాజ నాట్య పీఠ విద్యార్థులు దేశవ్యాప్తంగా అద్భుతమైన నృత్య ప్రదర్శనలలో అలరించడం గొప్ప విషయమన్నారు. నాట్య గురువు వేణుగోపాలశర్మ విద్యార్థులను నాట్యమయూరాలుగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. చిన్నారులు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా చదువుతో ప్రత్యేకాంశాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలి

● ఎమ్మెల్యే బాలునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సమష్టిగా కృషి చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి తోడ్పడాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చందంపేట మండలంలోని పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం నిర్వహించిన మండల స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత భూభారతి, సన్నబియ్యం పథకం, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలతో పేదవారి ముఖాలలో ఆనందాన్ని నింపిందన్నారు. జూలై నెలలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని కోరారు. మండలంలో పార్టీ బలోపేతం చేయడంతో పాటు అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్యనాయక్, మాజీ ఎంపీపీ సర్వయ్య, గోవిందు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, నాయకులు గోసుల అనంతగిరి, కొర్ర రాంసింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందించాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆహారభద్రత లబ్ధిదారులకు ప్రభుత్వం బియ్యంతో పాటు నిత్యావసర సరుకులందించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తిరందాసు విష్ణు డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యంతో పాటు పప్పు, ఉప్పు, చక్కెర అందించాలని కోరారు. సన్నబియ్యంలో నూక కలపకుండా చర్యలు తీసుకోవాలని, సకాలంలో అందించాలని ఆయన కోరారు.

చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీలు

చింతపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల చెక్‌పోస్ట్ వద్ద హైవేపై వెళ్లే వాహనాలను చింతపల్లి ఎస్ఐ రామ్మూర్తి ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వెళ్లే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేసి ఆధార పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది శంకర్‌నాయక్, సైదయ్య, సైదులు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

త్రిపురారం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నాయిపాలెం బీజేపీ యూత్ అధ్యక్షుడు గంగుల లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబం ఇబ్బందులు పడుతుండటంతో విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ తన యువసేన సభ్యుల ద్వారా ఆదివారం రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. లింగయ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కిలారు సైదయ్య, మన్నెం రంజిత్ యువసేన అధ్యక్షుడు కుంటిగొర్ల రాజశేఖర్, నాయకులు గంగుల చిన సైదులు, తెల్కలపల్లి శ్రీను, బైరం సతీష్, మన్నెం లింగయ్య, చింతముండ్ల వెంకన్న, పోకల వీరయ్య, కుర్ర నాగరాజు, మెండు శివ, వెంకన్న, కొండల్ తదితరులు పాల్గొన్నారు.



లింగయ్య కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..?

- ప్రమాదకరంగా రోడ్డు కేబుల్ గుంతలు
- పట్టించుకోని అధికారులు



రాజవరం సమీపంలో గుంత కోసం తీసిన మట్టిని రోడ్డుపైనే పోసిన దృశ్యం

తిరుమలగిరి(సాగర్), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్వాల ఎక్స్‌రోడ్డు నుంచి డొక్కలబావితండా వరకు పలు గ్రామాలను కలుపుతూ ఓ ప్రైవేట్ టెలికాం సంస్థ రోడ్డు వెంట అండర్ గ్రౌండ్ కేబుల్స్ ఏర్పాటు చేసేందుకు పనులను చేస్తుంది. ఈ సందర్భంలో సదరు సంస్థ ఒక కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించినట్లు తెలిసింది. అయితే గుత్తెదారు ఆర్ అండ్‌బీ రోడ్డు వెంట పెద్ద ఎత్తున గుంతలు తీసి సరిగా మట్టితో చదును చేయకుండా నామమాత్రంగా పనులను చేశాడు. ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు లోడ్‌తో వెళ్తున్న లారీలు, ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాలు సరిగా పూడ్చని గుంతలో బోల్తాపడిన సందర్భాలు గత కొంతకాలంగా తరుచుగా చోటు చేసుకుంటున్నాయి. అయితే అల్వాల ఎక్స్‌రోడ్డు, తిరుమలగిరి, కొంపల్లి, బోయగూడెం, రాజవరం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గుంతలు తీసి నెలలు దాటినా పూడ్చకుండా వదిలేశారు. అయితే గుంత కోసం తీసిన మట్టిని కూడా రోడ్డుపైనే పోయడం తో రోడ్డు మార్గం ఇరుకుగా మారి వాహనాలు వెళ్లేందుకు వీలు లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో ఈ భారీ సైజుల ను గుర్తించలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయినప్పటికీ ప్రైవేట్ టె లికాం సంస్థతోపాటు కాంట్రాక్టర్ పనులను సకాలంలో పూర్తిచేయకుండా నిర్లక్ష్యం చేస్తుండటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అల్వాల గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద పనులు పూర్తయిన తర్వాత పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారిన గుంత

కేబుల్ గుంతలో పడి పాడి గేదె మృతి

మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కేబుల్ వైర్లు వేసేందుకు తీసిన గుంతలో గురువారం రాత్రి పాడి గేదె పడి మృతి చెందింది. గుంత ఇరుకుగా ఉండటంతో పాటు గుంతలో పడిన గేదెను ఎవరూ గుర్తించకపోవడంతో అందులోనే ప్రాణాలు విడిచింది. ఇప్పటికైనా ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తక్షణమే గుంతలను పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రామకృష్ణ

దేవరకొండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణించాలని, తమవంతుగా సహాయ, సహకారాలు అందిస్తామని దేవరకొండ ఆర్‌కె ఫౌండేషన్ నిర్వాహకులు పున్న రామకృష్ణ అన్నారు. దేవరకొండలో ఆదివారం నిర్వహించిన ఉచిత సమ్మర్ కరాటే శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను ఆయన అభినందించి సన్మానించారు. విద్యార్థులు కరాటేలో శిక్షణ పొందాలన్నారు. ఆర్‌కే ఫౌండేషన్ క్రీడాకారులకు సహకారం అందిస్తుంద ని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ శ్రీను, అన్వర్ పాష, విజయ్‌కుమార్, మాస్టర్ జగన్, గుండాల వెంకటేష్, విద్యార్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన జానా



రేపాల లింగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తునన కుందూరు జానారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడటౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పితృవియోగంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్‌ను సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి పరామర్శించారు. రేపాల శ్రీనివాస్ తండ్రి లింగయ్య శనివారం మృతిచెందగా విషయం తెలుసుకున్న జానా ఆదివారం లింగయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లింగయ్యతో సన్నిహిత సంబంధాలు ఉండేవని గుర్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తదితరులు పరామర్శించారు. వారి వెంట నాయకులు నీరుకంటి నారాయణ, జయిని వెంకటరమణ, జానీ, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

రేపు గొట్టిముక్కలలో సీపీఐ మహాసభ

దేవరకొండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండ సీపీఐ మండల 14వ మహాసభ ఈ నెల 3వ తేదీన మండలంలోని గొట్టిముక్కలలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మండల మహాసభకు సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, పల్లా నర్సింహారెడ్డి, దేవేందర్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై మండల మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అధికారులు సమయపాలన పాటించాలి : సీపీఎం



చెత్తకుప్పల నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, గ్రామస్తులు

వేములపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు విధులు నిర్వహించే పంచాయతీరాజ్ అధికారులందరూ సమయ పాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతకాలంగా స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆయన ఆరోపించారు. గ్రామాలకు వస్తున్నా కొద్ది సమయం మాత్రమే అందుబాటులో ఉండి ఆపై ఇంటికి పరిమితమవుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా మండలస్థాయి అధికారి గ్రామపంచాయతీల్లో నిత్యం సందర్శించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంబీలను ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు తనిఖీలు చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. సంబంధిత ఇంజనీర్లు గ్రామాల్లోని పనులను పరిశీలించి ఆయా ఎంబీలన తనిఖీ చేసి నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో శీలం చినసైదులు, వల్లమల్ల ఎల్లయ్య, సైదులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడంపై ఆగ్రహం

తిరుమలగిరి(సాగర్): పారిశుధ్యాన్ని పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంపై సీపీఎం నాయకులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పది రోజులుగా ఇంటింటి నుంచి చెత్తను ట్రాక్టర్ల ద్వారా సేకరించడం లేదని, గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలుగా పేరుకొనిపోయాయని సీపీఎం సీనియర్ నాయకుడు వేములకొండ పుల్లయ్య అన్నారు. ఆదివారం చెత్త కుప్పలను పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. డ్రైనేజీలను శుభ్రం చేయడం లేదని దీనివల్ల గ్రామస్థులు ఇబ్బదులు పడుతున్నట్లు తెలిపా రు. పన్నులు వసూలు చేస్తున్న అధికారులు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుర్రి సైదయ్య, షేక్ చాంద్‌పాషా, బుర్రి మధు, గ్రామ పెద్దలు కలకోటి పెదఅంజయ్య, పోలేపల్లి దుర్గయ్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.